PRABHATA SURYA
ప్రభాత సూర్య
తెలుగు దిన పత్రిక
www.suryaa.news
వెల రూ.5/ - పేజీలు : 8 ఆదివారం 20 జూలై 2025 సంపుటి: 01, సంచిక : 75
PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

## ఎస్‌బీఐకి వరల్డ్ బెస్ట్ కన్స్యూమర్ బ్యాంక్ అవార్డు

**న్యూఢిల్లీ:** దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ).. 2025 సంవత్సరానికి గాను గ్లోబల్ ఫైనాన్స్ మ్యాగజైన్ నుంచి ప్రపంచంలోనే అత్యుత్తమ కన్స్యూమర్ బ్యాంక్ అవార్డును గెలుచుకుంది. ప్రపంచవ్యాప్తంగా కార్పొరేట్ ఫైనాన్స్ ఎగ్జిక్యూటివ్స్, బ్యాంకర్స్, విశ్లేషకుల నుంచి సేకరించిన వివరాలను మదింపు చేయటంతో పాటు సమగ్ర పరిశోధన, విశ్లేషణ ఆధారంగా ఎస్‌బీఐని ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు గ్లోబల్ ఫైనాన్స్ వెల్లడించింది. కాగా బ్యాంక్ అభివృద్ధి వ్యూహానికి ఖాతాదారుల అనుభూతి మూలస్తంభమని ఎస్‌బీఐ చైర్మన్ సీ. శ్రీనివాసులు శెట్టి ఈ సందర్భంగా అన్నారు.

విలేకరులు కావలెను
సీనియర్ జర్నలిస్టుల సారథ్యంలో వస్తోన్న జాతీయ తెలుగు దినపత్రిక 'సూర్య' కి నిబద్ధత కలిగిన యువ, నవతరం కలం యోధులు కావాలి.
96667 32777
ప్రభాత సూర్య
www.suryaa.news

# అర్హులందరికీ పథకాలు



- బలహీనవర్గాల సంక్షేమానికే... కులసర్వే
- అది డేటా మాత్రమే కాదు.. తెలంగాణకు మెగాహెల్త్ చెకప్
- నిపుణుల కమిటీ నివేదికపై మంత్రిమండలిలో చర్చిస్తాం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడి
- సీఎంకు సర్వే నివేదిక అందించిన స్వతంత్ర నిపుణుల కమిటీ

**సూర్య న్యూస్ హైదరాబాద్**

రాష్ట్రంలో చేపట్టిన సామాజిక, ఆర్థిక, రాజకీయ కులసర్వే కేవలం డేటా కాదని, తెలంగాణకు నిర్వహించిన మెగా హెల్త్‌చెకప్ అని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రంలోని బలహీనవర్గాల అభ్యున్నతికి, సామాజిక న్యాయాన్ని అమలు చేసేందుకు ఈ నివేదిక ఉపయోగపడుతుందన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రంలో కుల సర్వే విజయవంతంగా పూర్తి చేశామని వెల్లడించారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కులగణన నివేదికను అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం నియమించిన స్వతంత్ర నిపుణుల కమిటీ 300 పేజీలతో కూడిన వివరణాత్మక నివేదికను శనివారం మర్రి చెన్నారెడ్డి మానవవనరుల అభివృద్ధి సంస్థలో జరిగిన సమావేశంలో సీఎంకు అందజేసింది. కమిటీ చైర్‌పర్సన్ జస్టిస్ సుదర్శ న్‌రెడ్డి, సభ్యులు కంచ ఐలయ్య, హిమాన్షు, డాక్టర్ సుఖదేవ్ తొరాట్, నిఖిల్‌డే, భాంగ్యభూక్య, పురుషోత్తంరెడ్డి, ప్రవీణ్ చక్రవర్తి, కమిటీ కార్యదర్శి అనుదీప్ - మిగతా2లో



## 23 నుంచి మోదీ విదేశీ పర్యటన

- రెండు దేశాలతో దౌత్య, వాణిజ్య, ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసుకోవడమే లక్ష్యంగా ఈ పర్యటన
- అత్యంత కీలకమైన ఇండియా-యూకే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం(ఎఫ్‌టీఏ)పై సంతకం
- రక్షణ రంగంలో పరస్పర సహకారంపై యూకే ప్రధానమంత్రి కీర్ స్టార్మర్‌తో చర్చలు




## పార్లమెంటులో అమీతుమీ..

- ఇండియా కూటమి వర్చువల్ మీట్
- బీహార్‌లో ఎన్నికల కమిషనర్ ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ చేపట్టడం, ఇటీవల పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి, ఆపరేషన్ సింధూర్ వంటి అంశాలు సమావేశం ఎజెండాలో కీలకం

# కమీషన్ కోసం డీలర్ల ప'రేషన్'

**ఏప్రిల్ నుంచి కమీషన్ అందని వైనం**

**రాష్ట్రవ్యాప్తంగా రూ.115 కోట్లకుపైగా బకాయిలు**




**సూర్య హైదరాబాద్**

రాష్ట్రంలో వచ్చే ఆగస్టు వరకు పేదలకు పీడీఎస్ బియ్యం పంపిణీ చేసిన రేషన్ డీలర్లు ప్రభుత్వం నుంచి రావాల్సిన కమీషన్ కోసం ఎదురుచూస్తున్నారు. ఈ ఏడాది మార్చినెల వరకే ప్రభుత్వం రేషన్ కమీషన్ అందజేసింది. ఏప్రిల్ నెల నుంచి ఇవ్వకపోగా, జూన్ నెలలో ఒకేసారి మూడు నెలల బియ్యాన్ని పేదలకు పంపిణీ చేయడంతో ఐదు నెలల కమీషన్ పెండింగ్‌లో ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా 92 లక్షల ఆహార భద్రతాకార్డులు (రేషన్‌కార్డులు) ఉండగా, ఆయా కార్డుదారులకు 17,286 రేషన్ దుకాణాల ద్వారా - మిగతా2లో



## రాష్ట్రంలో భారీగా రైల్వే సేవల విస్తరణ

**కాచిగూడ-జోద్‌పూర్ రైలు ప్రారంభోత్సవంలో రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్**

**సూర్య న్యూస్ హైదరాబాద్**

తెలంగాణలో రైల్వే మౌలిక వసతులను భారీగా విస్తరించినట్లు రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. దశలవారీగా రైల్వే నెట్‌వర్క్ పెంచినట్లు చెప్పారు. కాచిగూడ-జ్యోద్‌పూర్ డెయిలీ ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసును శనివారం కాచిగూడ స్టేషన్‌లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అశ్వినీ వైష్ణవ్ మాట్లాడుతూ.. హైదరాబాద్‌తోపాటు తెలంగాణలోని వివిధ ప్రాంతాల్లో నివాసం ఉంటున్న రాజస్తాన్ ప్రజల చిరకాల కోరిక నెరవేరిందని - మిగతా2లో



## సాగర్‌లోకి కృష్ణమ్మ పరవళ్లు

- 242.72 టీఎంసీలకు చేరిన నిల్వలు
- మూడు, నాలుగు రోజుల్లో గేట్లుఎత్తే అవకాశం
- శ్రీశైలంకు మళ్లీ పెరిగిన వరద ఉధృతి
- ఆల్మట్టి, నారాయణపూర్ డ్యామ్‌ల నుంచి లక్ష క్యూసెక్కులు దిగువకు విడుదల

## మెట్రో రెండో దశపై కేంద్రం నిర్లక్ష్యం



- డీపీఆర్‌లు ఇచ్చి 9 నెలలైనా ఆమోదించలేదు
- ఈ ప్రాజెక్టు కోసం కలిసికట్టుగా పోరాడుదాం
- రాష్ట్రంలోని ఎంపీల సమావేశంలో భట్టి, కోమటిరెడ్డి
- ఆదాయం ఎలా పంచుకుంటారని బీజేపీ ఎంపీల ప్రశ్న

**సూర్య న్యూస్ హైదరాబాద్**

హైదరాబాద్ మెట్రో రెండో దశ ప్రాజెక్టుపై 9 నెలల క్రితమే కేంద్రానికి డీపీఆర్‌లు అందజేసినప్పటికీ ఇప్పటివరకు ఆమోదించకపోవడం అన్యాయమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. వచ్చే పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో పార్టీలకు అతీతంగా ఈ ప్రాజెక్టు కోసం కేంద్రంపై ఒత్తిడి తేవాలని పిలుపునిచ్చారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాల నేపథ్యంలో మెట్రో రైల్ ప్రాజెక్టు విషయంలో ఎదురవుతున్న సవాళ్లపై శనివారం పార్క్‌హయత్ హోటల్‌లో ప్రభుత్వం వివిధ పార్టీల ఎంపీలతో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. కాంగ్రెస్ ఎంపీలు మల్లు రవి, కిరణ్ కుమార్‌రెడ్డి, రఘువీర్‌రెడ్డి, రఘురామిరెడ్డి, - మిగతా2లో



## వాల్‌స్ట్రీట్ జర్నల్, రాయిటర్స్‌కు నోటీసులు

- విమాన ప్రమాదంపై ఊహాజనిత కథనాలు రాశాయన్న పైలట్ల సంఘం
- క్షమాపణకు డిమాండ్
- అహ్మదాబాద్ విమాన ప్రమాదానికి పైలట్ తప్పిదం, విమాన కాక్‌పిట్‌లో నెలకొన్న అయోమయం కారణాలని రాయిటర్స్, వాల్‌స్ట్రీట్ జర్నల్‌లు ప్రచురించిన కథనాలు

# హై'పవర్' డేటా సెంటర్స్!

- విద్యుత్ శాఖకు చుక్కలు చూపిస్తున్న బిగ్ డేటా కేంద్రాలు
- ఒక్కో కేంద్రానికి 500 మెగావాట్లు అవసరం
- బిగ్ డేటా సెంటర్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు
- వీటితో రెట్టింపుకానున్న డిమాండ్.. విద్యుత్ శాఖ గుబులు.. బొగ్గు కొరతపై జెన్‌కో ఆందోళన
- డిమాండ్‌ను అందుకోవాలని విద్యుత్ శాఖను ఆదేశించిన ప్రభుత్వం



**సూర్య న్యూస్ హైదరాబాద్**

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రాష్ట్ర విద్యుత్ శాఖకు షాక్ ఇస్తోంది. అంచనాలకు మించిన విద్యుత్ డిమాండ్‌ను సృష్టిస్తుంది. అన్ని సాఫ్ట్‌వేర్ సంస్థలూ ఏఐతో కనెక్ట్ అవుతుండటంతో హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో డేటా కేంద్రాలు పెరుగుతున్నా యి. బిగ్ డేటా కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు వస్తున్నాయి. ఒక్కోటి 500 మెగావాట్ల కెపాసిటీ విద్యుత్‌ను ఉపయోగించే స్థాయిలో ఉంటాయని అంచనా. ఇది జెన్‌కోలో ఒక ప్లాంట్ సామర్థ్యంతో సమానం. ఇదే ఇప్పుడు విద్యుత్ శాఖకు గుబులు పుట్టిస్తోంది. అయితే, విద్యుత్ డిమాండ్‌ను తట్టుకునేలా చేయాలని విద్యుత్ శాఖను ప్రభుత్వం ఆదేశించింది. దీంతో అధికారులు - మిగతా2లో

# సంరక్షణకు దాతల సహాయం

జగిత్యాల

దూడ నుంచి కాడెద్దు వరకు.. రైతుకు సేవలందించిన పశువులను వయసు మీరిన తర్వాత కబేళాలకు తరలించడం వారిని కదిలించింది. తనువు చాలించే వరకూ వాటిని రక్షించాలని అప్పుడే సంకల్పించారు. అనుకున్నదే తడవుగా స్వచ్ఛందంగా గోశాలను ఏర్పాటు చేసి 28 ఏళ్లుగా గోవులను రక్షిస్తున్నారు. వాటి పేడతో వర్మి కంపోస్టు, గోఆధారిత ఉత్పత్తులు తయారు చేసి పలువురి మన్ననలు అందుకుంటున్నారు జగిత్యాల రూరల్ మండలం తాటిపల్లి గ్రామ శివారులోని సురభి గోశాల నిర్వాహకులు.



**నాలుగు ఆవులతో ప్రారంభం**

1997లో దాతల సహకారంతో రెండున్నర ఎకరాల్లో గోశాలను ఏర్పాటు చేశారు. ఇందులో కొంతభాగం ఆవుల కోసం షెడ్లను నిర్మించారు. కొంతభాగంలో ఆవుల పేడతో వర్మి కంపోస్టు తయారు చేస్తున్నారు. మరో 20 గుంటల భూమిలో పాడి ఆవులు, దూడల కోసం పచ్చిగడ్డిని పెంచుతున్నారు. మొదట నాలుగు ఆవులతో ప్రారంభమైన గోశాల.. ప్రస్తుతం 200 ఆవుల వరకు చేరింది.

గోశాలకు స్థలం సరిపోకపోవడంతో.. మేడిపల్లి శివారులో 41 ఎకరాలు కొనుగోలు చేశారు. అందులో పశువులను మేపడంతోపాటు పదెకరాల్లో నీలగిరి చెట్లు పెంచుతున్నారు. ప్రస్తుతం గోశాలలో 160 వరకు ఆవులు ఉన్నాయి. వంద ఆవులను మేడిపల్లి శివారు షెడ్లలో ఉంచుతున్నారు. మరో 60 ఆవులను తాటిపల్లి షెడ్లలో ఉంచుతున్నారు. గోశాల చుట్టూ ప్రహరీ గోడతో పాటు.. మూడు కుటుంబాల కూలీలు ఉండేందుకు షెడ్లు నిర్మించారు.

**దాతల దాతృత్వంతో..**

ప్రారంభం నుంచే గోశాల దాతల సహకారంతో నడుస్తోంది. కరోనాకు ముందు ఆవుల కోసం గడ్డిని కొనుగోలు చేసినప్పటికీ.. ప్రస్తుతం చుట్టుపక్క గ్రామాల రైతులే ఉచితంగా ఇస్తున్నారు. గతంలో ఆవులకు పుట్టిన ఆంబోతులను రైతులకు అమ్మితే.. కొంత ఆర్థికంగా కలిసి వచ్చేది. ఇప్పుడు ఉచితంగా ఇస్తామన్నా.. తీసుకునేవారు లేరు. ఫలితంగా ఆవులను రక్షించాల్సిన బాధ్యత నిర్వాహకులపై పడింది. ప్రతినెలా కూలీల ఖర్చులు, పశువుల దాణా, మందులు వంటి నిర్వహణ కోసం రూ.1.5 లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు. కిలోమీటరున్నర దూరంలోని ఎస్సారెస్పీ కెనాల్ వద్ద వేసిన బోరు నుండి.. గోశాలలోని నీటి తొట్టెల్లోకి తాగునీటిని పంపింగ్ చేసి పశువుల దాహార్తిని తీర్చుతున్నారు. పశువుల పేడతో వర్మి కంపోస్టు, పశువుల మూత్రంతో గో%-%ఆర్కను తయారు చేసి విక్రయిస్తుండటంతో, వాటిద్వారా వచ్చే అదాయం గోశాలకు కొంతమేర వెసులుబాటుగా మారింది.

**గోశాలలో నిత్య పూజలు.. శిక్షణ**

గోశాలలో సప్త గోసైత కృష్ణ మందిరం నిర్మించడంతో పాటు రోజూ నిత్య పూజలు చేస్తుంటారు. గోశాల కమిటీ నిర్వాహకులతో పాటు.. అక్కడి కూలీలు ఆవులను గాయత్రి, లక్ష్మి, దేవత, మల్లి అంటూ పేర్లతో పిలుస్తుంటారు. దీనికి తోడు, ఏటా కార్తీక పౌర్ణమి రోజు గోశాల వన భోజనాలు, గో పూజలతో సందడిగా ఉంటుంది. వారానికోసారి ఆవులను పశు వైద్యులు పరిక్షిస్తుంటారు. గోశాలలో గో ఆధారిత వ్యవసాయం, ప్రకృతి వ్యవసాయం, పెట్టుబడి లేని సాగు పద్ధతులపై రైతులకు శిక్షణ ఇచ్చేందుకు రూ.35 లక్షలతో రైతు శిక్షణ మందిరం నిర్మించారు. ఇందులో నెలకోమారు సేంద్రియ వ్యవసాయ నిపుణులతో రైతులకు సదస్సులు నిర్వహిస్తున్నారు.

**ప్రభుత్వ ప్రోత్సాహం అంతంతే..**

గోశాలకు పెద్దగా ప్రభుత్వ ప్రోత్సాహం అందడం లేదు. పలు పార్టీల రాజకీయ నాయకులు గోశాలకు వచ్చినప్పటికీ.. పెద్దగా నిధులు విడుదల చేసిన దాఖలాలు లేవు. ఇది చాలదన్నట్లు, పోలీసులు ఎక్కడో పట్టుకున్న ఆవులను గోశాలలో వదిలేసి వెళ్తుండటం, వాటి నిర్వహణ ఖర్చులు కూడా ఇవ్వకుండా నెలల తరబడి ఉంచుతుండటం, కేసులో ఉన్న పశువులు చనిపోతే పోస్టుమార్టమ్ చేయించడం వంటి అనవసర సమస్యలు గోశాల నిర్వాహకులకు ఇబ్బందిగా మారాయి.

# మెట్రో రెండో దశపై కేంద్రం నిర్లక్ష్యం

-మొదటిపేజీ తరువాయి

పోరిక బలరాం నాయక్, అనిల్ కుమార్ యాదవ్, సురేష్ షెట్కార్, బీజేపీ ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రఘునందన్ రావు తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

సమావేశంలో హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి మెట్రో రెండో దశపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ, అన్ని పార్టీల ఎంపీలు సహకరిస్తేనే మెట్రో రెండో దశను సాధించుకోగలమని చెప్పారు. తెలంగాణ కంటే చిన్న రాష్ట్రాల్లో మెట్రో నిర్మాణానికి అనుమతులు ఇచ్చారని, మన రాష్ట్రంపై మాత్రం కేంద్రం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు.

**ఎల్అండ్‌టీతో ఎలా ముందుకెళ్తారు?**

పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) పద్ధతిలో మెట్రో మొదటి దశ నిర్మాణం చేపట్టిన ఎల్అండ్‌టీ సంస్థతో కలిసి రెండో దశపై ఎలా ముందుకెళ్తారని బీజేపీ ఎంపీలు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 'రెండోదశ పూర్తయితే ప్రయాణికుల సంఖ్య బాగా పెరిగి ఎల్అండ్‌టీకి కూడా ఆదాయం లభిస్తుంది. ప్రయాణికుల నుంచి టికెట్ల ద్వారా వచ్చే ఆదాయాన్ని ఎల్అండ్‌టీతో కలిసి ఎలా పంచుకుంటారు? విద్యుత్ భారం, నిర్వహణ ఖర్చులపై కూడా స్పష్టత రావాల్సి ఉంది'అని పేర్కొన్నారు. ఎంపీలు లేవనెత్తిన సందేహాలపై ఎన్వీఎస్ రెడ్డి వివరణ ఇచ్చారు. సమావేశం అనంతరం కాంగ్రెస్ ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. హైదరాబాద్ మహా నగరాన్ని రాజకీయాలకతీతంగా తీర్చిదిద్దుకుందామని పిలుపునిచ్చారు. ట్రిపుల్ ఆర్ పూర్తయిన తర్వాత హైదరాబాద్ లోపలి వైపున రవాణా వ్యవస్థను ఎంత



అభివృద్ధి చేసుకుంటే ప్రపంచ స్థాయి నగరాలతో హైదరాబాద్ అంతగా పోటీ పడుతుందని అభిప్రాయపడ్డారు.

# హై'పవర్' డేటా సెంటర్స్!

-మొదటిపేజీ తరువాయి

తర్జనభర్జన పడుతున్నారు.

**ఏం చేద్దాం?**

రాష్ట్రంలో పీక్ సమయంలో 15497 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ నమోదవుతోంది. 2034 నాటికి ఇది 33773 మెగావాట్లకు చేరుతుందని అంచనా. డిమాండ్‌లో ప్రధాన భూమిక ఐటీ కేంద్రాలదే. ముఖ్యంగా డేటా కేంద్రాల వల్లే డిమాండ్ పెరిగే వీలుంది. విద్యుత్ లభ్యతను పెంచకపోతే ప్రతిపాదిత డేటా కేంద్రాలు వెనక్కుపోయే ప్రమాదం ఉంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని అత్యవసర ప్రణాళిక రూపకల్పనకు ప్రభుత్వం విద్యుత్ శాఖను ఆదేశించింది. కొత్తగా వచ్చి న యాదాద్రితో కలుపుకొంటే 5580 మెగావాట్ల సామర్థ్యం గల విద్యుత్ కేంద్రాలున్నాయి. 70 శాతం లోడ్ ఫ్యాక్టర్‌తో పనిచేసినా ఇవి 109 మిలియన్ యూనిట్లు ఇవ్వగలవు. అయితే, బొగ్గు కొరత, తరచూ బ్యాక్‌డౌన్ కారణంగా గరిష్టంగా రోజుకు 60 మిలియన్ యూనిట్లే ఇస్తున్నాయి. పీక్ సమయంలో రాష్ట్రంలో రోజుకు 308 మిలియన్ యూనిట్ల విద్యుత్ డిమాండ్ ఉంటోంది. డేటా కేంద్రాల ఏర్పాటుతో డిమాండ్ రెట్టింపు అయితే రోజుకు 600 మిలియన్ యూనిట్లు కావాలి. ఈ నేపథ్యంలో పెరిగే విద్యుత్ డిమాండ్‌ను తట్టుకునేందుకు జెన్‌కో మార్గాన్వేషణకు సిద్ధమవుతోంది. ప్రస్తుతం యాదాద్రి పవర్ ప్లాంట్‌ను పూర్తిస్థాయిలో ఉత్పత్తి చేయడం జెన్‌కోకు కీలకం. దీని సామర్థ్యం 4 వేల మెగావాట్లు. ఇక్కడ 55 వేల మెట్రిక్ టన్నుల బొగ్గ నిల్వలు ఉంటే తప్ప ముందుకెళ్లలేని పరిస్థితి. ఈ బొగ్గుపై సింగరేణి సంస్థ స్పష్టత ఇవ్వలేదు. ప్రస్తుతం 4



ర్యాకులతో బొగ్గు సరఫరా జరుగుతోంది. దీన్ని 14 రేకులకు పెంచాలి. దీంతో జెన్‌కో అధికారులు రైల్వే, సింగరేణితో భేటీకి సన్నద్ధమవుతున్నారు.

**కొనుగోలు తప్పదా?**

ప్రస్తుతం రోజుకు 300 మిలియన్ యూనిట్ల (ఎంయూ) విద్యుత్ డిమాండ్ ఉంటేనే... మార్కెట్లో విద్యుత్ కొనాల్సి వస్తోంది. జెన్‌కో థర్మల్ 57, హైడల్ 25, సింగరేణి నుంచి 23 మిలియన్ యూనిట్ల విద్యుత్ అందుతోంది. రోజూ 149 మిలియన్ యూనిట్లు కేంద్ర సంస్థలు, మార్కెట్ నుంచి సమకూర్చుకుంటున్నారు. మధ్యా హ్నం యూనిట్ గరిష్టంగా రూ.2.5కు లభిస్తున్నా, రాత్రిపూట మాత్రం యూనిట్ రూ.8 వరకూ వెళ్తోంది. రాబోయే రోజుల్లో రోజుకు 600 ఎంయూ డిమాండ్ ఉంటే... ధర ఎంత ఉన్నా మార్కెట్ నుంచి భారీగా కొనుగోలుచేయాల్సి రావొచ్చు.

## సాగర్‌లోకి కృష్ణమ్మ పరవళ్లు

హైదరాబాద్

నాగార్జునసాగర్‌లోకి కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. శనివారం మధ్యాహ్నం 12 గంటలకు నాగార్జునసాగర్‌లోకి 67,800 క్యూసెక్కులు చేరడంతో నీటి నిల్వ 564.4 అడుగుల్లో 242.72 టీఎంసీలకు చేరుకుంది. సాగర్ నిండాలంటే ఇంకా 69 టీఎంసీలు అవసరం. ఎగువన ఉన్న జలాశయాల నుంచి భారీగా వరద విడుదల చేస్తున్న నేపథ్యంలో మరో మూడు నాలుగు రోజుల్లో నాగార్జునసాగర్ నిండుతుందని అధికారవర్గాలు అంచనా వేస్తున్నాయి. జూరాల, సుంకేశుల బ్యారేజ్‌ల నుంచి శ్రీశైలం ప్రాజెక్టులోకి 1,56,327 క్యూసెక్కులు చేరుతుండగా.. విద్యుదుత్పత్తి ద్వారా ఏపీ, తెలంగాణ రాష్ట్రాలు 68 వేల క్యూసెక్కులను దిగువన సాగర్‌కు విడుదల చేస్తున్నాయి. శ్రీశైలం నుంచి పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ ద్వారా 20వేల క్యూసెక్కులు, హంద్రీ నీవా కోసం 1,013 క్యూసెక్కులను ఏపీ తీసుకుంటుండగా, కల్వకుర్తి ఎత్తిపోతల ద్వారా 1,600 క్యూసెక్కులను తెలంగాణ తీసుకుంటోంది. మహారాష్ట్ర, కర్ణాటకల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కృష్ణా ప్రధాన పాయతోపాటు మలప్రభ, ఘటప్రభలు వరదెత్తుతున్నాయి. దాంతో ఆల్మట్టి, నారాయణపూర్ డ్యామ్‌లలోకి వరద ఉధృతి పెరిగింది. ఆల్మట్టి డ్యామ్‌లోకి 94వేల క్యూసెక్కులు చేరుతుండగా.. 90 వేల క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నారు. నారాయణపూర్ డ్యామ్‌లోకి 1.15 లక్షల క్యూసెక్కులు చేరుతుండగా.. 1.01 లక్షల క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. జూరాల ప్రాజెక్టులోకి 1.15 లక్షల క్యూసెక్కులు చేరుతుండగా.. 1.22 లక్షల క్యూసెక్కులను దిగు వకు వదిలేస్తున్నారు. తుంగభద్ర డ్యామ్‌కి వస్తున్న 39,339 క్యూసెక్కుల వరదను వచ్చిందొచ్చినట్టుగా దిగువన శ్రీశైలంకు విడుదల చేస్తున్నారు.

## అర్హులందరికీ పథకాలు

-మొదటిపేజీ తరువాయి

దురిశెట్టి సమావేశమయ్యారు.

డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు పొన్నం, ఉత్తమ్, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్, సీఎం సలహాదారు వేంనరేందర్‌రెడ్డి, ఎంపీ మల్లు రవి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎం ముఖ్యకార్యదర్శి వి.శేషాద్రి, ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, బీసీ సంక్షేమశాఖ కార్యదర్శి ఇ.శ్రీధర్, గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి ఎ.శరత్ పాల్గొన్నారు. సర్వే శాస్త్రీయంగా, సమగ్రంగా, వాస్తవికంగా ఉందని నిపుణుల కమిటీ అభిప్రాయపడింది. సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. నిపుణుల కమిటీ సమర్పించిన నివేదికలోని అంశాలు, సూచనలు మంత్రిమండలిలో చర్చించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. సామాజిక న్యాయం, అన్నివర్గాల సాధికారత లక్ష్యంగా దేశంలోని తొలిసారిగా సామాజిక, ఆర్థిక, కులసర్వే నిర్వహించామన్నారు. రాష్ట్రంలో పట్టణాలు, గ్రామాల మధ్య వ్యత్యాసాలు, కారణాలపై నిపుణుల కమిటీ అధ్యయనం చేయాలన్నారు. ప్రజావసరాలు గుర్తించి సరైన సూచనలివ్వాలని కమిటీని కోరుతున్నానని పేర్కొన్నారు.

**సర్వే విశ్లేషణ ఆధారంగా వనరులు అందిస్తాం: డిప్యూటీ సీఎం**

రాష్ట్రంలో ప్రభుత్వం చేపట్టిన కులసర్వే విశ్లేషణ ఈ దేశ దిశను మార్చుతుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. "సర్వే నివేదికపై స్వతంత్ర నిపుణులు చేసిన అధ్యయనం చరిత్రాత్మకమైనది. ప్రపంచవ్యాప్తంగా, దేశవ్యాప్తంగా వివిధ రంగాల్లోని ప్రముఖులు, వివాదరహితుల్ని సభ్యులుగా నియమించాం. ఈ విశ్లేషణ ఆధారంగా సంపద, వనరులు ఇంకా అందని వర్గాలకు అవన్నీ చేరవేస్తాం. భారత్ జోడో యాత్రలో రాహుల్ ఇచ్చిన మాట మేరకు మా ప్రభుత్వం కులసర్వే చేపట్టింది. దీనిపై మంత్రిమండలిలో చర్చించి విజయవంతంగా సర్వేను ముగించాం. అసెంబ్లీలోనూ ఈ కులసర్వేపై ప్రశ్నలు అడిగారు తప్ప... లోపాలున్నాయని ఎవరూ చెప్పలేదు. అణగారిన వర్గాలకు ప్రయోజనం చేయాలన్న బాధ్యతతో చేసిన సర్వే విజయవంతమైంది" అని పేర్కొన్నారు.

**సర్వే జరిగిందిలా..**

మొదటిదశలో 2024 నవంబరు 6 నుంచి డిసెంబరు 25 వరకు 50 రోజుల పాటు సర్వే నిర్వహించింది. జనాభా వివరాల కోసం జిల్లాలోని ప్రతి 150 కుటుంబాలను ఒకబ్లాక్‌గా పేర్కొని, ఆ బ్లాక్‌కు ఒక ఎన్యుమరేటర్‌ను.. ఇలా 10 మంది ఎన్యుమరేటర్లకు ఒక సూపర్‌వైజర్‌ను నియమించింది. తొలివిడతలో 96.9 శాతం కుటుంబాలను సర్వే చేసి, ఆ వివరాలను 36 రోజుల్లో డేటా ఎంట్రీ చేసింది. వివిధ కారణాలతో తొలిదశలో పాల్గొనని కుటుంబాలకు ఫిబ్రవరి 16 నుంచి 28 వరకు మరోసారి అవకాశం కల్పించింది. సర్వేను పూర్తిచేసి ఆ నివేదికను శాసనసభకు అందజేసింది. సర్వే ఫలితాలు అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో 11 మంది సభ్యులతో స్వతంత్ర వర్కింగ్ గ్రూపు ఏర్పాటు చేసి, వివరణాత్మక నివేదిక ఇవ్వాలని సూచించింది. ఈ కమిటీ సమావేశాలు నిర్వహించి, డేటా సమీకరించిన విధానం సమగ్రంగా ఉందని అభిప్రాయపడింది. ప్రభుత్వ విధానాల రూపకల్పనతో పాటు ప్రస్తుతం అమల్లోని విధానాలు మెరుగుపరిచేందుకు, సామాజిక న్యాయం సాధికారతతో పాటు వెనుకబడిన వర్గాల అభివృద్ధికి సహాయపడుతుందని స్వతంత్ర నిపుణుల కమిటీ పేర్కొంది.

## రాష్ట్రంలో భారీగా రైల్వే సేవల విస్తరణ



-మొదటిపేజీ తరువాయి

అన్నారు. హైదరాబాద్ నుంచి భోపాల్ మీదుగా జోద్‌పూర్‌కు ప్రతిరోజూ రైలు రాకపోకలు సాగిస్తుందని చెప్పారు. ఈ రైలును అహ్మదాబాద్ మీదుగా నడపాలని డిమాండ్లు వస్తున్నాయని, కానీ అహ్మదాబాద్‌లో కొన్ని నిర్మాణ పనుల వల్ల ప్రస్తుతం ఆ మార్గంలో నడపడం సాధ్యం కాదని తెలిపారు. మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో రైల్వేస్టేషన్లను ఆధునిక హంగులతో పునరాభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. రూ.720 కోట్లతో చేపట్టిన సికింద్రాబాద్ స్టేషన్ పునర్నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయని అన్నారు. రైల్వేస్టేషన్లలో ఉచిత వైఫై సహా సకల సదుపాయాలు కల్పిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ శ్రీవాస్తవ తదితరులు పాల్గొన్నారు.

**శంకర్‌పల్లి టు కాజీపేట రైలు ప్రయాణం**

శంకర్‌పల్లి: సంగారెడ్డి జిల్లాలోని ఐఐటీ హైదరాబాద్ స్నాతకోత్సవానికి శనివారం వచ్చిన కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్.. అక్కడ నుంచి కాజీపేటకు వెళ్లేందుకు రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి రైల్వే స్టేషన్‌కు వచ్చారు. అక్కడి నుంచి రైలులో కాజీపేటకు ప్రయాణించారు. ఆయనతో పాటు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు తదితరులు ఉన్నారు.

### వాల్ స్ట్రీట్ జర్నల్, రాయిటర్స్‌కు లీగల్ నోటీసులు పంపిన పైలట్ల సంఘం..

# క్షమాపణలు చెప్పాలని డిమాండ్!

జూన్ 12 అహ్మదాబాద్ విమానం ప్రమాదంపై విదేశీ మీడియా తప్పుడు వార్తలపై ఇండియన్ పైలట్ల సంఘం అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ మేరకు ది వాల్ స్ట్రీట్ జర్నల్, రాయిటర్స్‌కు లీగల్ నోటీసులు పంపింది. తప్పుడు కథనాలు ప్రచారం చేసినందుకు రెండు సంస్థలు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా ఇండియన్ పైలట్ల సంఘం అధ్యక్షుడు ఎసీ రంధవా మాట్లాడుతూ తాము చట్టపరమైన చర్యలు ప్రారంభించామన్నారు. ఆయా వార్తా కథనాలపై ది వాల్ స్ట్రీట్ జర్నల్, రాయిటర్స్‌కు నోటీసులు పంపినట్లు చెప్పారు. క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశామన్నారు. సంస్థలకు పంపిన మెయిల్‌లో ధ్రువీకరించని సమాచారంతో ప్రమాదంపై పదే పదే తప్పుడు వార్తలు ప్రచారం చేస్తున్నారంటూ తమకు తెలిసిందని పెలట్ల సంఘం పేర్కొంది. ఈ ప్రమాదం ప్రజలను దిగ్భ్రాంతికి గురి చేసిందని తెలిపింది. అధికారికంగా నిర్ధారణ లేకుండా ప్రమాదానికి గల కారణాలపై ఊహాగానాలు చేస్తూ మరణించిన పైలట్లదే తప్పు అని ఏ వార్తనైనా మీడియా సంస్థలు ప్రచారం చేయకూడదని పైలట్ల సంఘం పేర్కొంది. ఊహాజనిత సమాచారంతో వార్తలు ప్రచురించడం బాధ్యతారహితమైన చర్య అని, మరణించిన పైలట్ల ప్రతిష్టకు తీవ్రమైన, కోలుకోలేని నష్టాన్ని కలిగించిందని ఆగ్రహం వ్యక్తం చేసింది. మృతి చెందిన పైలట్లతో పాటు ప్రయాణికుల కుటుంబాలు తీవ్రంగా ఆవేదన గురువుతున్నాయని పేర్కొన్నారు. ఈ నెల 17న ప్రచురించిన వార్తపై వెంటనే సమీక్షించి సవరించాలని రాయిటర్స్‌కు సూచించింది. 'పైలట్లదే కారణం' అన్న ఏ విషయాన్ని అయినా తొలగిస్తూ




వివరణ ఇవ్వాలని పైలట్ల సంఘం రాయిటర్స్‌ను సూచించింది. ఈ విషయంలో స్పందించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని నోటీసుల్లో హెచ్చరించింది. ఎన్‌టీఎస్‌బీ బోర్డు ప్రకటనపై పైలట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాంధవా హర్షం వ్యక్తం చేశారు. యూఎస్ ఫెడరల్ ఏజెన్సీ అయిన నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీ బోర్డ్ (%చీూదీ%) ఇటీవలి విమా ప్రమాదం మీడియా కవరేజీని తీవ్రంగా తప్పుపట్టింది. ఎయిర్ ఇండియా 171 కూలడంపై వచ్చిన వార్తలన్నీ ఊహాజనితమైనవని ఎన్ఎస్‌బీటీ చైర్ జెన్నిఫర్ హెూమెండి పేర్కొన్నారు. భారతదేశ ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో ప్రాథమిక నివేదికను విడుదల చేసింది.

## రూ.14లక్షల కోట్లతో..

# చైనా 'మెగా డ్యామ్' పనులు ప్రారంభం

ఇంటర్నెట్ డెస్క్: ప్రపంచంలోనే అత్యంత భారీ జల విద్యుత్తు ప్రాజెక్టు నిర్మాణాన్ని చైనా ప్రారంభించింది. శనివారం మొదలైన ఈ ప్రాజెక్టు పనుల కార్యక్రమంలో చైనా ప్రధాని లీ కియాంగ్ పాల్గొన్నారు. టిబెట్‌లోని యార్లంగ్ జాంగ్బో (బ్రహ్మపుత్ర) నదిపై చేపడుతోన్న ఈ వివాదాస్పద ప్రాజెక్టు కోసం డ్రాగన్ దాదాపు 1.2 ట్రిలియన్ యువాన్‌లు (సుమారు రూ. 14లక్షల కోట్లు) ఖర్చు పెట్టనున్నట్లు అంచనా. ఈ ప్రాజెక్టుపై భారత్, బంగ్లాదేశ్‌లు ఆందోళన వ్యక్తం చేస్తున్నప్పటికీ డ్రాగన్ మాత్రం మొండిగా ముందుకు పోతున్నట్లు కనిపిస్తోంది. 'చైనా యాజియాంగ్ గ్రూపు' పేరుతో కొత్తగా ఓ సంస్థను ఏర్పాటు చేసి.. ఈ ప్రాజెక్టు బాధ్యతలు దీనికి అప్పజెప్పినట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్టులో మొత్తం ఐదు డ్యామ్‌లు ఉండనున్నాయి. టిబెట్‌లోని నైంగ్చీ నగరంలో.. భారీ స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా దీన్ని చేపడుతున్నారు. ఈ విద్యుత్‌ను బయటకే సరఫరా చేయనున్నప్పటికీ స్థానిక అవసరాలకు కూడా కొంతమేర వినియోగించనున్నట్లు సమాచారం.

**ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన ప్రాజెక్టు..**

భారీ ఖర్చుతో చేపడుతున్న ఈ ప్రాజెక్టు.. ప్రపంచంలోనే అత్యంత ఖరీదైనదిగా నిలువనుంది. దీనిద్వారా ఏటా 300 బిలియన్ కిలోవాట్-అవర్స్ విద్యుత్తును ఉత్పత్తి చేయాలన్నది లక్ష్యం. ఇది చైనా గతంలో నిర్మించిన ప్రపంచంలో అతిపెద్దదైన త్రీగోర్జెస్ డ్యామ్‌కన్నా మూడురెట్లు భారీది. బ్రహ్మపుత్ర నది 'గ్రేట్ బెండ్'గా పిలిచే భారీ వంపు ప్రాంతంలో రెండువేల మీటర్ల దిగువకు ప్రవహిస్తుంది. స్వల్పదూరంలో నిటారుగా పడటంవల్ల అక్కడ జల విద్యుత్తు ఉత్పత్తికి అవకాశాలున్నాయి.

**భారత్ ఆందోళన వ్యక్తం చేసినా..**

హిమాలయాల్లో టిబెట్ నుంచి అరుణాచల్‌ప్రదేశ్‌కు నది గమనంలో వంపు తిరిగే చోట ఈ డ్యామ్‌ను నిర్మిస్తున్నారు.



భారీ డ్యామ్ నిర్మాణం వల్ల ఇక్కడి భౌగోళిక ప్రదేశానికి, పర్యావరణానికి తీరని నష్టం కలగవచ్చనే అభిప్రాయాలున్నాయి. దీనివల్ల అరుణాచల్‌తోపాటు అస్సాం రాష్ట్రాలపై ప్రతికూల ప్రభావం పడుతుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఒకవేళ రెండు దేశాల మధ్య సంఘర్షణ సంభవిస్తే చైనా ఈ డ్యామ్ నుంచి ఒక్కసారిగా భారీ పరిమాణంలో నీటిని విడుదలచేస్తే అక్కడి భూభాగాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉంది.

**మొండిగా ముందుకు..**

దీనిపై భారత విదేశాంగ ఇటీవల స్పందిస్తూ.. ఈ ప్రాజెక్టుపై పర్యవేక్షణ కొనసాగిస్తామని, తమ దేశ ప్రయోజనాలను కాపాడుకునేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపింది. ఎగువ ప్రాంతాల్లో నిర్మించే ప్రాజెక్టుల వల్ల దిగువన ఉన్న ప్రాంతాలకు హాని కలగకుండా చూసుకోవాలని చైనాకు సూచించింది. ఈ నేపథ్యంలో తన నిర్ణయాన్ని సమర్థించుకున్న చైనా.. ఈ ప్రాజెక్ట్ విషయంలో అనేక శాస్త్రీయ అంశాలను పరిగణనలోకి తీసుకున్నామని, భారత్, బంగ్లాదేశ్‌లపై ఎటువంటి ప్రతికూల ప్రభావం చూపదని తెలిపింది. భారత్‌లో నదీ ప్రవాహంపై ఎలాంటి ప్రభావం ఉండదని పేర్కొంది.

## ఉక్రెయిన్‌పై మళ్లీ విరుచుకుపడ్డ రష్యా..

# 300కు పైగా డ్రోన్‌లతో దాడి

రష్యా-ఉక్రెయిన్ దేశాల మధ్య కాల్పుల విరమణ కోసం ఒకవైపు మంతనాలు జరుగుతున్నాయి. అయినా ఉక్రెయిన్‌పై రష్యా దాడులు కొనసాగిస్తోంది. తాజాగా రష్యా సైన్యం ఉక్రెయిన్‌పై 300కు పైగా డ్రోన్లు, 30 క్షిపణులతో విరుచుకుపడింది. ఈ దాడిలో అనేక ఉక్రెయిన్‌లో అనేక నివాస భవనాలు, ఆస్పత్రులు, వాహనాలు ధ్వంసమైనట్లు తెలిసింది. భవనాల శిథిలాల కింద అనేక మంది అమాయక ప్రజలు చిక్కుకున్నారని, వారిని బయటకు తెచ్చేందుకు భద్రతా బలగాలు సహాయక చర్యలు చేపడుతున్నాయని ఉక్రెయిన్ మీడియా తెలిపింది. క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నట్లు వెల్లడించింది. రష్యన్ దళాలు ఉక్రెయిన్‌లోని ఒడెసా నగరంపై 20కి పైగా డ్రోన్లు, పదుల సంఖ్యలో క్షిపణులు ప్రయోగించింది. దాంతో భారీ ఆస్తి నష్టం సంభవించింది. ఈశాన్య సుమీ ప్రాంతంలో కీలకమైన మౌలిక సదుపాయాలు దెబ్బతిన్నాయి. అయితే ఈ యుద్ధం సమయంలో తమకు అండగా ఉంటూ ఆయుధాలను సరఫరా చేస్తున్న మిత్ర దేశాలకు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ కృతజ్ఞతలు తెలిపారు. రష్యాతో జరుగుతున్న యుద్ధాన్ని ఎదుర్కోవడానికి ఉక్రెయిన్‌కు ఆస్ట్రేలియా ఆయుధ సాయం చేస్తోంది. ఇందులోభాగంగా శనివారం కీవ్‌కు %వీ1ూ%1 అబ్రమ్స్ ట్యాంకులను



అందజేసింది. ఇతర సామగ్రిని రాబోయే నెలల్లో పంపనున్నట్లు ఆస్ట్రేలియా రక్షణమంత్రి రిచర్డ్ మార్లెస్ పేర్కొన్నారు. కీవ్‌పై మాస్కో చేస్తున్న చట్టవిరుద్ధమైన, అనైతిక దండయాత్రకు వ్యతిరేకంగా తాము ఈ సాయాన్ని అందిస్తున్నామని ఆస్ట్రేలియా రక్షణ మంత్రి తెలిపారు.

## 23 నుంచి మోదీ విదేశీ పర్యటన

న్యూఢిల్లీ

ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 23 నుంచి 26వ తేదీ దాకా యునైటెడ్ కింగ్‌డమ్(యూకే), మాల్దీవ్స్ దేశాల్లో పర్యటించనున్నారు. రెండు దేశాలతో దౌత్య, వాణిజ్య, ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసుకోవడమే లక్ష్యంగా ఈ పర్యటన సాగనుంది. మోదీ తొలుత ఈ నెల 23, 24న యూకేలో పర్యటిస్తారు. అత్యంత కీలకమైన ఇండియా-యూకే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం(ఎఫ్‌టీఏ)పై సంతకం చేస్తారు. రక్షణ రంగంలో పరస్పర సహకారంపై యూకే ప్రధానమంత్రి కీర్ స్టార్మర్‌తో చర్చలు జరుపుతారు. అలాగే ఈ నెల 25, 26న మాల్దీవ్స్‌లో మోదీ పర్యటన కొనసాగనుంది. మాల్దీవ్స్ 60వ జాతీయ దినోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొంటారు.

## పార్లమెంటులో అమీతుమీ..

న్యూఢిల్లీ

పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో అధికార పక్షంతో అమీతుమీకి ఇండియా కూటమి సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా సమావేశాల్లో చర్చించాల్సిన కీలక అంశాలు, అనుసరించాల్సిన వ్యూహంపై విపక్ష ఇండియా కూటమి నేతలు శనివారం వర్చువల్ సమావేశం నిర్వహించారు. 24 పార్టీలకు చెందిన నేతలు హాజరయినట్టు కాంగ్రెస్ నేత, రాజ్యసభ ఎంపీ జైరామ్ రమేష్ తెలిపారు. చాలా వారాల తర్వాత ఇండియా కూటమి నేతల సమన్వయ సమావేశం జరగడం విశేషం. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చీఫ్ సోనియాగాంధీ, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ, సీపీఐ (ఎంఎల్) ప్రధాన కార్యదర్శి దీపంకర్ భట్టాచార్య తదితరులు ఈ వర్చువల్ మీట్‌లో పాల్గొన్నారు. బీహార్‌లో ఎన్నికల కమిషనర్ ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ చేపట్టడం, ఇటీవల పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి, ఆపరేషన్ సింధూర్ వంటి అంశాలు సమావేశం ఎజెండాలో కీలకంగా ఉన్నాయి. భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలను తగ్గించేందుకు తాను మధ్యవర్తిత్వం చేశానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించుకోవడం, తన నివాసంలో కాలిన నోట్ల కట్టలు కనిపించడంతో వివాదంలో చిక్కుకున్న జస్టిస్ యశ్వంత్ వర్మను అభిశంసించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతుండటంపై వీటిపై ఉభయసభల్లో అనుసరించాల్సిన వైఖరిని సమావేశంలో చర్చించినట్టు తెలుస్తోంది. జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హెూదా పునరుద్ధరించాలని కాంగ్రెస్ పట్టుబట్టనుంది. మహిళలపై పెరుగుతున్న నేరాలు, అహ్మదాబాద్ విమానం ప్రమాదం, పెరుగుతున్న నిరుద్యోగం, రైతుల కష్టాలు వంటి అంశాలను కూడా పార్లమెంటులో ప్రస్తావించాలని కాంగ్రెస్ భావిస్తోంది. ఈ అంశాలపై పార్టీ అనుసరించాల్సిన వ్యూహంపై ఈవారం ప్రారంభంలో 10 జనపథ్ నివాసంలో సోనియాగాంధీ అధ్యక్షతన పార్టీ పార్లమెంటరీ స్ట్రాటజీ గ్రూప్ సమావేశం కూడా జరిగింది.

## వాల్‌స్ట్రీట్ జర్నల్, రాయిటర్స్‌కు నోటీసులు

దిల్లీ

అహ్మదాబాద్ ఎయిరిండియా విమాన ప్రమాదంపై ఊహాజనిత కథనాలను ప్రచురించాయని పేర్కొంటూ వాల్‌స్ట్రీట్ జర్నల్, రాయిటర్స్‌లకు భారత పైలట్ల సమాఖ్య (ఎఫ్ఐపీ) లీగల్ నోటీసులు జారీ చేసింది. ఈ మీడియా సంస్థలు ప్రచురించిన వార్తలు తమకు వ్యథను కలిగించడమేగాక.. భారత పౌర విమానయానరంగ ప్రతిష్ఠను దెబ్బతీశాయని పేర్కొంది. నిజానిజాలు నిర్ధారించుకోకుండా ప్రమాదంపై వార్తలు ప్రచురించినందుకు మీడియా సంస్థలు క్షమాపణ చెప్పాలని డిమాండు చేసింది. అహ్మదాబాద్ విమాన ప్రమాదానికి పైలట్ తప్పిదం, విమాన కాక్‌పిట్‌లో నెలకొన్న అయోమయం కారణాలని రాయిటర్స్, వాల్‌స్ట్రీట్ జర్నల్‌లు ప్రచురించిన కథనాలకు స్పందనగా పైలట్ల సమాఖ్య ఈ చర్య తీసుకుంది. మరోవైపు విమాన ప్రమాద ఘటనపై దర్యాప్తు పూర్తికాక ముందే వస్తున్న మీడియా కథనాలను అమెరికాకు చెందిన నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీ బోర్డు (ఎన్టీఎస్‌బీ) తీవ్రంగా ఖండించింది. మీడియా సంస్థలు ప్రచురిస్తున్న వార్తలు అపరిపక్వంగా, ఊహాగానాలతో కూడి ఉన్నాయని ఎన్టీఎస్‌బీ ఛైర్మన్ జెన్నీఫర్ హమెండీ విమర్శించారు. విమాన ప్రమాద ఘటనపై దర్యాప్తు చేస్తున్న విమాన ప్రమాద దర్యాప్తు బ్యూరో (ఏఏఐబీ) వెలువరించనున్న తుది నివేదిక కోసం వేచి చూడాలని ప్రజలను, మీడియాను కోరారు.

**ఖండించిన ఏఏఐబీ**

అహ్మదాబాద్‌లో ఎయిరిండియా విమాన ప్రమాదంతోపాటు ఆ ఘటనకు సంబంధించిన ప్రాథమిక దర్యాప్తులోని అంశాలపై వస్తున్న ఊహాజనిత వార్తలపై ఏఏఐబీ మండిపడింది. దర్యాప్తు ఇంకా కొనసాగుతున్న దశలో ముందే ఒక నిర్ణయానికి రావడం తొందరపాటే అవుతుందని స్పష్టం చేసింది

## కమీషన్ కోసం డీలర్ల ప'రేషన్'..

-మొదటిపేజీ తరువాయి

ప్రతి నెల 1.70 లక్షుల మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ జరుగుతోంది. క్వింటాల్‌కు రూ.140 చొప్పున ప్రభుత్వం డీలర్లకు చెల్లిస్తుంది. ఈ లెక్కన 1.70 లక్షల మెట్రిక్ టన్నులకు ప్రతి నెలా రూ.23 కోట్ల వరకు కమీషన్ కింద ఇస్తోంది. ఐదు నెలలకుగాను రూ.115కోట్ల వరకు డీలర్లకు చెల్లించాల్సి ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో అయితే ఒక్కో డీలర్‌కు రూ.50 వేల నుంచి రూ.80 వేల వరకు బకాయిలు రావాల్సి ఉండగా, జీహెచ్ఎంసీతోపాటు మునిసిపల్ కార్పొరేషన్ల పరిధిలో రూ.లక్షకు పైగానే బకాయిలు ఉన్నాయి. ఇటీవల రేషన్ డీలర్ల కమీషన్ విడుదల చేయాలని రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాయికోటి రాజు, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కొక్కొండ వైకుంఠం పౌరసరఫరాల శాఖ సంయుక్త కమిషనర్ మనోహర్‌కుమార్ రాథోడ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. కమీషన్‌ను రూ.140 నుంచి 300కు పెంచాలని డీలర్లు కోరుతున్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ కమీషన్ పెంపుపై హామీ ఇచ్చి%శీ%ది. ప్రతి రేషన్ డీలర్‌కు నెలకు రూ.5 వేల చొప్పున గౌరవ వేతనం కూడా ఇస్తామని చెప్పింది. అయితే రేషన్ డీలర్లకు ఇచ్చిన హామీలేవీ అమలు కాలేదు.

## 2027 నాటికి మూడో అతి పెద్ద ఆర్థికశక్తిగా భారత్

**ఇంటర్నెట్ డెస్క్:** ఎన్డీఏ పాలనలో భారత్ ప్రపంచంలోని అభివృద్ధి చెందిన దేశాలతో పోటీపడుతూ.. వేగంగా ముందుకు వెళ్తోందని కేంద్ర హెూంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు. 2027 నాటికి దేశం ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలుస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఉత్తరాఖండ్‌లోని రుద్రపుర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అమిత్ షా ప్రసంగిస్తూ.. ఈ వ్యాఖ్యలు చేశారు. 2014లో భాజపా ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి దేశంలో అభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు. పదేళ్లలో దేశాభివృద్ధిలో 60శాతం పెరుగుదల చోటుచేసుకుందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా 45వేల కిలో మీటర్ల రైల్వే లైన్లు, రోడ్లు నిర్మించామని అమిత్ షా అన్నారు. ప్రధానిగా ఉన్న సమయంలో అటల్ బిహారీ వాజ్‌పేయీ దేశాన్ని 11వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మార్చితే.. మోదీ దానిని నాలుగో స్థానానికి తీసుకువచ్చారన్నారు. త్వరలో భారత్‌ను ప్రపంచంలోనే మూడో ఆర్థిక శక్తిగా మార్చేందుకు తమ ప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. 2047 నాటికి దేశాన్ని అభివృద్ధి చెందిన దేశాల సరసన నిలబెడతానని ప్రధాని మోదీ ప్రతిజ్ఞ చేశారని.. దానికోసం తామందరం పని చేస్తున్నామని అన్నారు. దేవభూమిగా పేరుగాంచిన ఉత్తరాఖండ్‌కు రానున్న రోజుల్లో ప్రపంచం నలుమూలల నుంచి అనేక మంది పర్యాటకులు వచ్చేలా పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తామని అక్కడి ప్రజలకు హామీ ఇచ్చారు. దేశ ఆర్థిక వృద్ధిని తెలియజేసే ఐఎంఎఫ్ అంచనాలను ఉటంకిస్తూ..అమెరికా, చైనా, జర్మనీ మాత్రమే ప్రపంచ ఆర్థిక ర్యాంకింగ్స్‌లో మనకంటే ముందు ఉన్నాయని అమిత్ షా అన్నారు. ఇదే విధంగా మనం ముందుకు సాగితే మరో మూడేళ్లలో జర్మనీని దాటుకొని.. మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనుందని పేర్కొన్నారు. ఇందుకోసం మూలధన వ్యయాల పెంపు, సులభతర వ్యాపార నిర్వహణ, దేశంలో పెట్టుబడులు పెట్టడానికి ప్రపంచంలోని వివిధ కంపెనీలను ఆహ్వానించడం మొదలైన చర్యలు తీసుకుంటున్నామన్నారు.

# మోషన్ ఒలింపియాడ్ స్కూల్‌లో ఘనంగా బోనాల వేడుకలు

## పోతురాజులు, మహాకాళి నృత్యాలతో మురిసిన చందానగర్ విద్యా క్షేత్రం





**లింగంపల్లి, ప్రభాత సూర్య :** తెలంగాణ సాంస్కృతిక సంప్రదాయానికి ప్రతీకగా నిలిచే బోనాల పండుగను చందానగర్‌లోని మోషన్ ఒలింపియాడ్ స్కూల్ భక్తిశ్రద్ధలతో, సంప్రదాయ ఘనతతో నిర్వహించింది. శనివారం నిర్వహించిన ఈ కార్యక్రమం విద్యార్థుల ఉత్సాహంతో, ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది. విభిన్న వేషధారణలతో విద్యార్థుల సందడి ఈ వేడుకలో పోతురాజుల తాండవం, మహాకాళి వేషధారణలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. సంప్రదాయ దుస్తుల్లో తళుక్కుమన్న విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, పాటలు ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేశాయి. విద్యార్థుల ప్రతిభకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా అభినందనలు తెలిపారు. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన స్కూల్ ఛైర్మన్ ఉదయ్ రెడ్డి మాట్లాడుతూ, బోనాలు మన తెలుగు భాష, సంస్కృతికి మూలస్తంభాలు. చిన్న వయసులోనే ఈ సంప్రదాయాల గురించి తెలుసుకోవడం అనేది గొప్ప విషయం అని పేర్కొన్నారు. స్కూల్ ప్రిన్సిపాల్ సునీత మాట్లాడుతూ, ఈ పండుగ మన పూర్వీకుల ఆచార వ్యవస్థను, ఆధ్యాత్మిక చైతన్యాన్ని ప్రతిబింబించేది. పిల్లలు ఇందులో పాల్గొనడం ఎంతో ఆనందదాయకం అని చెప్పారు.

**విజేతలకు బహుమతులు**

సాంస్కృతిక ప్రోత్సాహానికి పునాది. ప్రతిభను చాటిన విద్యార్థులను బహుమతులతో ప్రోత్సహించారు. ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో పిల్లలు మరింత ఉత్సాహంగా పాల్గొనడంతో, ఈ వేడుక ఓ మహోత్సవ వాతావరణాన్ని సృష్టించింది. తల్లిదండ్రుల హర్షాతిరేకం విద్యార్థుల నృత్య నైపుణ్యం, ప్రదర్శనలు చూసి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. ఇలాంటి వేడుకలు పిల్లల్లో జ్ఞానం, గౌరవం పెంపొందిస్తాయి అంటూ వ్యాఖ్యానించారు.

# హుస్నాబాద్‌లో 'స్టీల్ బ్యాంక్'




**కరీంనగర్ :** సరికొత్త కార్యక్రమానికి పొన్నం సత్తయ్య చారిటబుల్ ట్రస్ట్ శ్రీకారం చుట్టింది. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను తగ్గించి దిశగా అడుగు వేసింది. స్టీల్ సామాగ్రి వాడకం తప్పని సరి చేసేలా వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించింది. 276 మహిళా సంఘాలకు స్టీల్ బ్యాంక్ నిర్వహణ బాధ్యతలను అప్పగిం చింది. ప్లాస్టిక్?.. ప్రతి ఒక్కరి జీవితంలో విడదీయలేని భాగంగా మారిపోయింది. ఆహార పదార్థాలు, పానీయాలను ప్యాక్ చేయటం దగ్గరి నుంచి ప్రతి వస్తువు తయారీలోనూ దీన్ని వాడుతున్నారు. ఓవైపు ప్లాస్టిక్ తో అనారోగ్య సమస్యలు వస్తాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నప్పటికీ? పరిస్థితుల్లో పెద్దగా మార్పులు రావటం లేదు. ముఖ్యంగా ఫంక్షన్ల వేళ? సింగిల్ యూజ్ ప్లాస్టిక్ తెగ వాడేస్తున్నారు. తద్వారా ఆరోగ్యానికి కాదు? పర్యావరణ సమస్యలు కూడా రెట్టింపువు తున్నాయి. రోజురోజూ ప్లాస్టిక్ కాలుష్యం పెరిగిపోతున్న నేపథ్యంలో?. పొన్నం సత్తయ్య చారిటబుల్ ట్రస్ట్ సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. స్టీల్ సామాగ్రి వాడకం తప్పని సరి చేసేలా వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇందులో భాగంగా హుస్నాబాద్ నియోజవర్గ పరిధిలోని 276 మహిళా సంఘాలకు స్టీల్ బ్యాంక్ నిర్వహణ బాధ్యతలను అప్పగించింది.ఇక నుంచి నియోజకవర్గ పరిధిలో జరిగే పెళ్ళిళ్ళు, శుభకార్యాల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను తగ్గించే దిశగా ముందుకెళ్లనున్నారు. వీటికి బదులుగా స్టీల్ సామాగ్రిని వాడేలా చర్యలు చేపట్టనున్నారు. ఈ స్టీల్ బ్యాంక్ లో?. టిఫిన్ ప్లేట్స్,లంచ్ ప్లేట్స్ ,వాటర్, టీ గ్లాస్ లు, కప్స్, డిష్ లు ,బకెట్లు , చెంచాలు ,వంటలకు అవసరమైన గిన్నెలు తదితర వస్తువులు అందుబాటులో ఉంటాయిప్లాస్టిక్‌కు బదులు స్టీల్ వాడకాన్ని ప్రోత్సహించే దిశగా ఈ స్టీల్ బ్యాంకులు పని చేస్తాయి. మంత్రి పొన్నం చేపట్టిన ఈ వినూత్న కార్యక్రమం ద్వారా ప్రజా ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజారోగ్యం దిశగా ఈ తరహా కార్యక్రమం చేపట్టడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మంత్రి పోన్నం ప్రభాకర్ కు కృతజ్ఞతలు తెలుపుతున్నారుతెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ గారికి స్వాగతం. హుస్నాబాద్ నియోజకవర్గం గ్రామీణ ప్రాంత నియోజకవర్గం. ఇక్కడ 160 గ్రామాలు ఉన్నాయి. 270 మహిళా సంఘాలకు స్టీల్ బ్యాంక్ పంపిణీ చేస్తున్నాం.. అందులో 500,400,300 కిట్స్ ఉన్నాయి. ఈ జిల్లా ఆదర్శంగా ఉండాలని స్టీల్ బ్యాంక్ పంపిణీ కార్యక్రమం చేపట్టాను. నా నియోజకవర్గంలో ఎవరూ అనారోగ్యం బారిన పడకుండా ఉండాలని స్టీల్ బ్యాంక్ పంపిణీ కార్యక్రమం చేపట్టాను" అని చెప్పుకొచ్చారు."340 హోటల్ లలో 3400 స్టీల్ గ్లాస్ లు పంపిణీ చేశాం. 74 వేల రైస్ ప్లేట్స్ ఈ నియోజకవర్గంలో పంపిణీ చేస్తున్నాం. నియోజకవర్గం ప్లాస్టిక్ రహితంగా ఉండాలని అధికారులను భాగస్వామ్యం చేస్తూ ప్లాస్టిక్ నిషేధించేలా స్టీల్ బ్యాంక్ పంపిణీ కార్యక్రమం చేపట్టాం. ప్లాస్టిక్ దూరం పెడితే మీరు అనారోగ్యాలను దూరం పెట్టినట్టే. నన్ను ఆశీర్వదించి గెలిపించిన మీకు అండగా ఉంటా. మట్టి పత్రాలు ప్రోత్సహించే విధంగా ఎన్నో కార్యక్రమాలు చేపట్టాం. ప్లాస్టిక్ వాడడం మంచిది కాదు అని ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు చూపించాలి" అని మంత్రి పొన్నం వివరించారు. ప్లాస్టిక్ ను దూరం పెడితేనే మనం ఆరోగ్యంగా ఉంటామన్నారు. ప్లాస్టిక్ ను దూరం పెట్టేలా మంత్రి పొన్నం ప్రభాకర్ స్టీల్ బ్యాంక్ పంపిణీ కార్యక్రమం చేపట్టడం గొప్ప విషయమని ప్రశంసించారు. పర్యావరణాన్ని మనమే కాపాడుకోవాలని పిలుపునిచ్చారు."ప్లాస్టిక్ తో మనకు ఇబ్బందులు వస్తాయి. కాన్సర్ తో పాటు ఇతర వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. కరోనా తరువాత ఆరోగ్యం మీద చాలా అవగాహన వచ్చింది. ఒకే సారి 70 వేల మంది తినేలా ఈరోజు స్టీల్ బ్యాంక్ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. మన కంటే ముందు తరం వారు చాలా ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకున్నారు. వారి చాలా ఆరోగ్యంగా ఉన్నారు" అని మంత్రి సురేఖ గుర్తు చేశారు."ప్లాస్టిక్ వందల సంవత్సరాలు భూమిలో కలిసిపోవు. భూమి ,నీటి కాలుష్యాన్ని చేస్తాయి. మురుగు నీరు వెళ్లకుండా అడ్డుపడుతుంటాయి. మీ ఆకలి తన ఆకలి అనుకొని సేవ చేసే వ్యక్తి పొన్నం ప్రభాకర్. వారి నాన్న పేరు మీద స్టీల్ బ్యాంక్ ఏర్పాటు చేస్తున్నారు. మహిళా సంఘాలకు స్టీల్ బ్యాంక్ పంపిణీ చేయటం దుర దృష్టితో ఆలోచించిన వ్యక్తి. ఇక నుండి ప్లాస్టిక్ మేము ముట్టుకోము అని మహిళలకు ప్రమాణం చేయాలి. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను మన జీవితంలో నుండి దూరం చేయాలి" అని మంత్రి కొండా సురేఖ కోరారు.

## చర్మరోగ నివారిణి 'నఖ రంజని'

గోళ్ళకు రంగును కలిగించే గోరింటాకు "నఖరంజని" అని పేరు. ఆషాడంలో గోరింటాకు పెట్టుకునే ఆచారం అనాదిగా ప్రబలంగా ఉంది. ఆయుర్వేద శాస్త్ర ప్రకారం గోరింట మంచి మూలిక. దాని ఆకులే కాదు... పూవులు, వేళ్ళు, బెరడు, విత్తనాలు, గింజలు, ఓషధ గుణాలు కలిగి ఉంటాయి. హన్నొటాన్నిక్ ఆసిడ్తో కూడి ఒకరకమైన చిరువిషం ఉంటుంది. గింజలో చమురుంటుంది. పూలతో అత్తరు, వాసన నూనె తయారు చేస్తారు. ఆకు నూరి ముద్దలో నిమ్మరసం కలిపి అరికాళ్ళకు పెట్టుకుంటే అరికాళ్ళ మంటలు, నొప్పులు తగ్గుతాయి. నూరిన ముద్దతో తెల్ల గుగ్గిలము కలిపి నుది టికి పట్టిస్తే తలనొప్పి తగ్గగలదు. ఈ మందును మశూచి బాధితుల పాదాలకు పట్టిస్తే, రోగుల కళ్ళలో అమ్మవారు పోయే దని చెపుతారు. ముద్దతో కీళ్ళనొప్పులు మటుమాయం అవుతాయి. ఆకుల నుండి తయారు చేసిన మలామా గాయాలను, కురుపులను మాన్పుతుంది. బెణుకులు, వాపులు, కషాయంతో కాపడం వల్ల తగ్గు తాయి. దీనిని పుక్కిట పెడితే నోటిలో పుండ్లు తగ్గుతాయి. గోరింట పువ్వులతో. నింపిన గుడ్డ సంచిని తలగడగా పెట్టుకుంటే మంచి నిద్ర కలిగిస్తుంది. గోరింటాకు ముద్దను గోళ్ళకు పెట్టుకోవడం వలన చక్కని రంగు కలిగిం చడమే కాక, వ్యాధుల బారి నుండి కాపాడుతుంది. గోరింటకు శరీరం లోని వేడిని తగ్గించే శక్తి ఉంది. గోరింట పొడిని మందుగా తీసుకోవడం, గోరింటతో కాచిన నూనెను వాడడం చిట్కా వైద్యంలో ఉన్నదే. కేవలం ఆషాఢం లోనే కాదు. శుభకార్యాల సందర్భాలలోనూ గోరింటాకు పెట్టుకోవాలని పెద్దలు సూచిస్తారు. గోరింటాకు ధారణ తెలుగు పడుచులలో విధివిధాయక కృత్యమైన్నది. అరికాళ్ళలో నూరిన ముద్ద చుక్క పెట్టుకుని, అది బాగా పట్టినట్లయితే అయిదవతన వృద్ధియని, బాగా పండితే భర్త ప్రేమ అధికమవుతుందని విశ్వాసం. ఆషాఢంలో మెట్టింటి నుండి పుట్టింటికి చేరుకునే కొత్త పెళ్ళి కూతుళ్ళు, పుట్టింట ఉన్న మనసు మెట్టినింటి ఉన్న భర్త ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ, గోరింటాకు పెట్టుకోవడం అనాదిగా ఆచరణలో ఉంది. జ్యేష్ట మాసంలో మొదలైన వర్షాలు ఆషాఢం వరకు ఊపందుకుంటాయి. అలా ఆడపడుచులు ఎక్కువగా వర్షాలలో తడవడం కద్దు. ఇక పొలం పనులు చేసుకునే వారు నిత్యం కాళ్ళు, చేతులు తడపకుండా ఉండలేరు. అలా చర్మ వ్యాధులు రావడం, గోళ్ళు దెబ్బ తినడం సహజం. అందుకే ఈ ఉపద్రవ నివారణకు గోరింటాకు కన్నెల నుండి వృద్ధుల వరకు ధారణ నిత్యకృత్యంగా మారింది. గోరింట ఆకును కాచు, చింత పండు, నిమ్మరసంతో మెత్తగా నూరి, మగపి ల్లలు, ఆడపిల్లలు, స్త్రీలు చేతి వేళ్ళకు, పారా ణిగా పాదాలకు పెట్టు కుంటారు. తద్వారా చర్మం, గోళ్ళు చిక్కని ఎర్రని రంగుతో శోభాయమానం అవుతాయి. కృత్రిమమైన రసాయనిక పదార్థాలతో తయారైన గోళ్ళరంగు కంటె గోరింటతో చేసుకున్న ముద్దతో పాత పద్ధతిని విడనాడకుండా ఉండాల్సిన అవస రాన్ని ప్రస్తుత తరుణంలో గుర్తెరగాలి. ఆషా ఢంలో గోరింటాకు పెట్టుకొమ్మన్నారని, ఎక్కడ పడితే అక్కడ దొరికే కోన్లమీద ఆధార పడడం మంచిది కాదు. అది శరీరానికి తాకినప్పుడు అందులో ఉండే లాసోన్ అనే సహజమైన రసాయనం వల్ల ఎరుపురంగు ఏర్పడుతుంది.

## రోడ్డుపై విరిగిపడ్డ చెట్టు...
## సహాయం అందించిన పోలీసులు






**చౌటుప్పల్. జులై 19 ప్రభాత సూర్య :** యాదాద్రి భువనగిరి జిల్లా, చౌటుప్పల్ మండలం, వలిగొండ రోడ్డు లోని లింగారెడ్డిగూడెం గ్రామ పరిధిలో శనివారం సాయంత్రం కురిసిన వర్షానికి రోడ్డుపై చెట్లు నేలకొరిగాయి. దీనితో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. విషయం తెలుసుకున్న సీఐ మన్మధ కుమార్, ట్రాఫిక్ సిఐ విజయమోహన్ లు స్పందించి హుటా హుటిన తమ సిబ్బందితో అక్కడికి చేరుకొని జెసిబి ల సహాయంతో రోడ్డుపై ఉన్న చెట్లను తొలగించి రాకపోకలకు అంతరాయం లేకుండా ట్రాఫిక్ ను పునరుద్ధరించారు. సకాలంలో స్పందించిన పోలీసుల తీరుకు ప్రజలు, వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు.

## కలుషిత త్రాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలి

**జలమండలి అధికారులకు ఆదేశాలు జారీ**
**చేసిన కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్**



**బాలానగర్, జులై 19 (ప్రభాత సూర్య) :** త్రాగునీరు కలుషితం కావడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే ఆ సమస్యను పరిష్కరించే దిశగా అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కొత్త నగర్ డివిజన్ కార్పొరేటర్ సతీష్ గౌడ్ జలమండలి అధికారులకు సూచించారు. కూకట్ పల్లి నియోజకవర్గం ఫతే నగర్ డివిజన్ పరిధిలోని ఇందిరాగాంధీ పురం లో త్రాగునీరు కలుషితం అవుతుంది అని స్థానికులు ఇచిన పిర్యాదు మేరకు జలమండలి మేనేజర్ అనిల్ కుమార్ తో కలిసి స్థానిక కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ పర్యటించారు. ఇందిరా గాంధీపురం లో ఒక వీధి త్రాగునీరు కలుషితం అవుతుంది దానికి గల కారణాలు పరిశీలి0చి సమస్యను వారం లో పరిష్కరించాలని మేనేజర్ కు ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ గౌస్, అన్వర్,సలీం భాయ్, షోకత్ కేసర్, హస్మత్, ఆరిఫ్, పాల్గొన్నారు.

## కిడ్స్ వరల్డ్ ది మోంటెస్సోరి స్కూల్‌లో ఘనంగా బోనాల పండుగ



**హైదరాబాద్, జూలై 19( ప్రభాత సూర్య):** హైదరాబాద్‌లోని కిడ్స్ వరల్డ్ ది మోంటెస్సోరి స్కూల్‌లో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకలో జిల్లెలగూడ కరస్పాండెంట్ జె. శ్రీనివాస్ రావు, ప్రిన్సిపాల్ కె. సరిత పాల్గొన్నారు.పాఠశాల విద్యార్థులు ఉత్సాహంగా ఈ వేడుకలో పాల్గొన్నారు. విద్యార్థులకు తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను పరిచయం చేయడంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.పిల్లలు రంగురంగుల దుస్తులు ధరించి, బోనాలను అలంకరించి, ఆషాఢ మాస పండుగ వాతావరణాన్ని నింపారు.ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహించారు.పిల్లలకు మన పండుగల గొప్పదనాన్ని తెలియజేయడమే కాకుండా, వారిలో సామూహిక స్ఫూర్తిని, సాంస్కృతిక అవగాహనను పెంపొందించిండం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం విద్యార్థులు పాల్గొన్నారు

# యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు





రెండతస్తులకు అనుమతులు బహుళ అంతస్తుల్లో భవనాలు
నిబంధనలకు విరుద్ధంగా సెల్లార్ల నిర్మాణం
పట్టించుకోని మున్సిపల్ అధికారులు

**వనపర్తి ప్రభాత సూర్య ప్రతినిధి :** వనపర్తి జిల్లాలో ఐదు మున్సిపాలిటీలు ప్రధాన మునిసిపాలిటీ జిల్లా కేంద్రంలోని అక్రమ నిర్మాణాలు జరుగుతున్న అడ్డుకోవాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. జీప్లస్ టుకు అనుమతులు తీసుకుని సెల్లార్లు తవ్వి ఏకంగా ఐదు, ఆరు అంతస్తుల్లో భవన నిర్మాణాలు చేపడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించక పోవడంతో ప్రజలు విమర్శిస్తున్నారు మున్సిపాలిటీ పరిధిలో అక్రమ కట్టడాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఎటువంటి అనుమతులు లేకుండా పరిమితికి మించి అంతస్తుల్లో భవన నిర్మాణాలు చేపడుతున్నారు.ప్రభుత్వం ఓ వైపు అక్రమనిర్మాణాలపై ఉన్నతాధికారులు కొరడా ఝులిపిస్తుంటే వనపర్తి మున్సిపల్ అధికారుల తీరుతోపట్టణ ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు.

**మున్సిపల్ ఆదాయానికి గండి**

వనపర్తిపట్టణ కేంద్రంలోని కొత్తకోట రోడ్డులో ప్రధాన రహదారి లో గజానికి రూ.80 వేలపైగా ఉంది. దీంతో అక్కడ స్థలాలున్న యజమానులు బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపడుతున్నారు. మున్సిపల్ కార్యాలయ సంబంధిత అధికారులు ముడుపులు ముట్టజెప్పడంతో పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మున్సిపల్ పరిధిలో జీప్లస్ టూ వరకే అనుమతులు ఇచ్చే అధికారం ఉంటుంది. అంతకు మించి అంతస్తులు నిర్మించాలంటే అనుమతులు తప్పనిసరి. కానీ కొందరు యజమానులు సెల్లార్లు తవ్వి మూడు నుంచి ఆరు అంతస్తుల వరకు నిర్మించి టూలెట్ బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. బహుల అంతస్తులు నిర్మించిన యజమానులు సెల్లార్లలోనూ వ్యాపార కార్యకలపాలు నిర్వహించుకునేందుకు అద్దెకు ఇస్తున్నారు. ఇందుకు మున్సిపాలిటీ ఆస్తి పన్ను చెల్లించాల్సి ఉంటుంది. వారు మాత్రం సెల్లార్ను పార్కింగ్గా చూపుతూ మున్సిపల్ ఆదాయానికి గండికొడుతున్నారు. ఇప్పటికై నా ఉన్నతాధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి కోరుతున్నారు.

**రోడ్లపైనే పార్కింగ్**

మున్సిపల్ పరిధిలో ప్రైవేట్ ఆస్పత్రులు, బ్యాంకులు, షాపింగ్ మాల్స్ వెలిశాయి. ఈ భవనాల్లోని సెల్లార్లలోనూ వ్యాపారాలు నిర్వహిస్తుండడంతో వాహనాలను రోడ్లపైనే పార్క్ చేస్తున్నారు. దీంతో నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రమాదాలు పెరిగిపోతున్నాయి.

**నామమాత్రపు నోటీసులు జారీ..**

వనపర్తి మున్సిపాలిటీ లో పరిధిలోని కింది స్థాయి మున్సిపల్ ఔట్సోర్సింగ్ అధికారి అక్రమంగా నిర్మిస్తున్న గృహ యాజమానుల నుంచి డబ్బులు వసూలు చేస్తూ అక్రమ కట్టడాలపై అధికారులకు సమాచారం ఇవ్వడం లేదని పలువురు పేర్కొంటున్నారు. మున్సిపాలిటీ పరిధిలో అధికారులు క్షేత్రస్థాయిలో తిరిగి అక్రమ కట్టడాలను గుర్తించాల్సింది పోయి.. కార్యాలయాల కుర్చీలకే పరిమితమవుతున్నారని, అక్రమార్కులపై ఫిర్యాదు చేసినా నామమాత్రపు నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకుంటున్నారని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. రాజకీయ నాయకుల ఒత్తిళ్లు, కాసులకు కక్కుర్తి పడి అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

# లక్కారం ఆదర్శ పాఠశాల, కళాశాలలో మాక్ పోలింగ్






-ఆకట్టుకున్న విద్యార్థుల మాక్ పోలింగ్
-ఎన్నికల భావనలను పరిచయం చేయడానికే...
-ఆదర్శ పాఠశాల కళాశాల ప్రిన్సిపల్ సరస్వతి

**చౌటుప్పల్.జులై 19. ప్రభాత సూర్య :** యాదాద్రి భువనగిరి జిల్లా, చౌటుప్పల్ పురపాలక కేంద్రం,లక్కారం గ్రామ పరిధి లోని ఆదర్శ పాఠశాల, కళాశాలలో శనివారం ప్రిన్సిపాల్ సరస్వతి పర్యవేక్షణలో విద్యార్థులకు మాక్ పోలింగ్ నిర్వహించారు. ఎన్నికల నమూనా కార్యక్రమంలో భాగంగా ఎన్నికల నిర్వహణ,పోలింగ్, ఈవీఎంపై ఓటింగ్ విధానం,కౌంటింగ్ పై విద్యార్థులకు అవగాహన కల్పించారు.మొత్తం ప్రక్రియను నిజమైన ఎన్నికల లాగానే నిర్వహించారు. పాఠశాలలో విద్యార్థులకు ఎస్ పి ఎల్,ఏఎస్ పిఎల్, కల్చరల్ సెక్రటరీ, స్పోర్ట్స్ సెక్రటరీ, తదితర శాఖలకు సంబంధించి ఎన్నికలను నిర్వహించారు.పోటీలో నిలిచిన విద్యార్థులకు గుర్తులను కేటాయించి ఉపాధ్యాయులు పోలింగ్ నిర్వహించారు. పాఠశా ల విద్యార్థులంతా మాక్ పోలింగ్ ఎన్నికలలో ఉత్సాహంగా పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. విద్యార్థులు ఎన్నికలలో పోటీ దారులుగా.. ఓటర్లుగా..ఎన్నికల సిబ్బందిగా..పోలీసులుగా విధులు నిర్వహించి అలరించారు.

**ఎన్నికల భావనను పరిచయం చేయడానికే: ప్రిన్సిపల్ సరస్వతి**

ఓటింగ్ వయసు రాకముందే ఎన్నికల భావనను పరిచయం చేయడానికి విద్యార్థులకు మాక్ ఎన్నికలు నిర్వహించినట్లు ఆదర్శ పాఠశాల కళాశాల ప్రిన్సిపల్ సరస్వతి తెలిపారు.ఈ మాక్ పోలింగ్లో నామినేషన్లు దాఖలు చేయడం, బ్యాలెట్ పేపర్ ద్వారా ఓటు వేయడం,ఓట్ల లెక్కింపు,ఎన్నికల్లో గెలుపొందిన అభ్యర్థులకు ధ్రువీకరణ పత్రాలు జారీ, తదితర అంశాలపై విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వలన ప్రజాస్వామ్యం, ప్రభుత్వం పాత్ర పై అవగాహన కల్పించడం, రేపటి తరం యువ ఓటర్లను భవిష్యత్తులో బ్యాలెట్ వేయడానికి, ప్రోత్సహించడానికి ఈ అనుభవం విద్యార్థులకు సహాయపడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళలు స్వశక్తిపై ఆర్థికంగా ఎదగాలి





- స్వయం సహాయక సంఘాల ఉత్పత్తుల మేళ...
-స్ట్రీట్ వెండర్ ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమం..
-చౌటుప్పల్ మున్సిపల్ కమిషనర్ గుత్తా వెంకట్రామిరెడ్డి

**చౌటుప్పల్.జులై 19. ప్రభాత సూర్య :** మహిళలు స్వశక్తిపై ఆర్థికంగా ఎదగాలని చౌటుప్పల్ మున్సిపల్ కమిషనర్ గుత్తా వెంకట్రాంరెడ్డి అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పురపాలక కేంద్రంలో 100 రోజుల కార్యక్రమంలో భాగంగా 48 వ రోజు చౌటుప్పల్ పురపాలక సంఘం ముందున్న కూరగాయల మార్కెట్ పక్కన ఎస్ హెచ్ జి సంఘాల ఉత్పత్తుల మేళా కార్యక్రమాన్ని శనివారం స్ట్రీట్ వెండర్ ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ కమిషనర్ జి వెంకట్రాంరెడ్డి పాల్గొని వారి చేతుల మీదుగా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో మహిళసంఘాల సభ్యులు వారు తయారు చేసిన అనేక రకాల హెూమ్ ఫుడ్ ఐటమ్స్, అనేక రకాల చేతితో తయారుచేసిన ఉత్పత్తులను ఈ కార్యక్రమంలో ప్రదర్శించారు.ఈ సందర్భంగా మున్సిపల్ కమీషనర్ వేంకట్రాం రెడ్డి మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి పథం లో నడవాలని,మహిళలు స్వయంగా తయారు చేసిన ఉత్పత్తులను ప్రతి ఒక్కరు కొనుగోలు చేసి వారు ఆర్థికంగా ఎదిగేటట్లు సహకరించాలని కోరారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని అన్నారు. మహిళలు కష్టపడి చేతితో తయారుచేసిన ఉత్పతులకు ఎక్కువ పబ్లిసిటీ అవుతుందని తెలియచేసారు. ఈ ఫుడ్ ఫెస్టివల్ మేళలో 30 స్టాళ్లను ఏర్పాటు చేయగా అందులో మొత్తం 40,000 వరకు సరుకులు అమ్ముడుపోవడం సంతోషదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ జి. వెంకట్రాం రెడ్డి, మేనేజర్ శ్రీధర్ రెడ్డి, ఏ ఈ సతీష్, ఎస్సై హనుమాన్, ఎన్విరాల్ ఇంజనీర్ రేణు కుమార్, టీఎంసీ కవిత,ఆఫీస్ స్టాఫ్, ఆర్పీలు, మహిళ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా నారాయణ స్కూల్లో ఆషాఢ బోనాల ఉత్సవం




**నల్గొండ జులై 19 ప్రభాత సూర్య** నల్గొండ జిల్లా కేంద్రంలోని హైదరాబాద్ రోడ్ లో గల నారాయణ స్కూల్లో ఆషాడ బోనాలు ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏజీఎమ్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడారు. రాష్ట్ర పండుగ అయిన బోనాల పండగ ముఖ్య ఉద్దేశాన్ని తెలియచేసి తెలంగాణ వారసత్వాన్ని, సంస్కృత, సాంప్రదాయాలను కాపాడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దివ్య రెడ్డి , ఏవో తరుణ్ రెడ్డి , ఏడీలు విజయ్, ఫరీద, వీపీ లు ఆఫ్రీన్, కవిత, జ్యోతి మరియు విద్యార్థినిలు ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు

## సాగునీరు అందించాలని అధికారులకు వినతి పత్రం అందజేత



**చౌటుప్పల్.జులై 19. ప్రభాత సూర్య :** పిలాయిపల్లి కాలువ బాచారం వద్ద నీటి సామర్థ్యం పెంచి, పెద్దగూడెం వద్ద గేటు లేక వృథాగా పోతున్న నీటిని అరికట్టి ఈ ప్రాంతానికి సాగునీరు అందించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యురాలు చీర్క అలివేలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం తెలంగాణ రైతు సంఘం చౌటుప్పల్ మండల కమిటీ ఆధ్వర్యంలో పిలాయిపల్లి కాల్వ బాచారం వద్ద నీటి సామర్థ్యం పెంచడంతోపాటు, పెద్దగూడెం వద్ద కాలువకు గేట్లు లేక నీరు వృథాగా పోతున్నందువల్ల అక్కడ గేట్లు నిర్మించి వృథా నీటిని అరికట్టి ఈ ప్రాంతాలకు సాగునీరు అందించాలని కోరుతూ నీటి పారుదల శాఖ డిఈ,ఈఈ,ఆర్డీవో లకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు బూర్గు కృష్ణారెడ్డి మాట్లాడుతూ... పిలాయి పల్లి కాలువ అనేక పోరాటలతో సాధించుకున్నామని తెలిపారు. ఈ కాల్వ ద్వారా పోచంపల్లి, చౌటుప్పల్,వలిగొండ, రామన్నపేట,చిట్యాల మండలాలలోని చెరువులు, కుంటలు నిండి రైతులకు సాగునీరు అందుతుందని తెలిపారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి పిల్లాయిపల్లి కాల్వ సామర్థ్యం పెంచి పెద్ద గూడెం వద్ద వృథాగా పోతున్న నీటిని అరికట్టి ఈ ప్రాంతాలకు సాగునీరు అందించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో చైర్మన్ సంఘం అధ్యక్షులు చీర్క సంజీవరెడ్డి, పొట్ట శ్రీను, ఆకుల ధర్మయ్య, ఇట్టబోయిన శేఖర్, జక్కిడి గోపాల్ రెడ్డి, చప్పిడి శ్రీనివాస్ రెడ్డి, కొండే శ్రీశైలం, బోయ యాదయ్య, తీగుళ్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ ఆర్ పాఠశాలలో ఘనంగా బోనాలు



**నల్లగొండ జులై 19 ప్రభాత సూర్య** రాష్ట్రంలో ఆషాడ మాసం పురస్కరించుకొని జరుగుతున్న లష్కర్ బోనాల సందర్భంగా నల్లగొండ పట్టణం, చర్లపల్లిలోని ఎస్ ఆర్ విద్యా సంస్థల్లో శనివారం ముందస్తుగా బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయినులు, విద్యార్థినులు బోనాలు ఎత్తుకొని నృత్య ప్రదర్శన చేసారు. అనంతరం అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు తీర్చారు. విద్యార్థుల పోతరాజు వేషధారణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం పాఠశాల జోనల్ ఇంచార్జి దోనాల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ బోనాల పండుగ తెలంగాణ రాష్ట్ర సంప్రదాయం, ఆచారాన్ని తెలియజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రూప ఏఓ సరితారెడ్డి, ఉపాధ్యాయినులు, ఉపాధ్యాయేతర సిబ్బంది మరియు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

## ఎమ్మెల్యే కుంభం కు వినతి పత్రం అందజేసిన తాజ్పూర్ గ్రామస్తులు

శ్రీశ్రీశ్రీ లింగేశ్వర స్వామి దేవాలయ నూతన కమిటీని రద్దు చేయాలి



**భువనగిరి,జూలై 19( ప్రభాత సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలంలోని తాజ్పూర్ గ్రామస్తులు శ్రీ శ్రీ శ్రీ లింగేశ్వర స్వామి దేవాలయ నూతన కమిటీ ని గ్రామంలో ఎవరి ప్రమేయం లేకుండా దేవాదాయ శాఖ అధికారులు నూతన కమిటీని వేశారని అట్టి కమిటీని రద్దుచేయాలని తాజ్పూర్ గ్రామస్తులు,బి ఆర్ఎస్ పార్టీ జిల్లా యువ నాయకులు డా. ర్యాకల శ్రీనివాస్ ఆధ్వర్యంలో భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ఎవరికి తెలవకుండా ఎవరి ప్రమేయం లేకుండా శ్రీ శ్రీ లింగేశ్వర స్వామి దేవాలయం కమిటీని వెయ్యడం చాలా దారుణమని అన్నారు. అట్టి కమిటీని తక్షణమే రద్దుచేసి గ్రామంలోని అందరి అభిప్రాయం తీసుకొని నూతన కమిటీని వేయాలని కోరారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు నాగరాజు, గిరిబాబు మైసయ్య వెంకటేష్ గోవర్ధన్ కిరణ్ సందీప్, రామకృష్ణ, మధు,కృష్ణ రాములు నరసింహ రాజు కొండల్ భాస్కర్ మహేష్ నరసింహ రమేష్ బాలయ్య పోచయ్య శంకరయ్య యువకులు తదితరులు పాల్గొన్నారు.

# సిపిఎం పార్టీ జిల్లా వర్క్ షాప్ ను జయప్రదం చేయాలి

జిల్లా వర్క్ షాప్ కరపత్రం విడుదల

-సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బూర్గు కృష్ణారెడ్డి


-జిల్లా కమిటీ సభ్యులు ఎండి పాషా,గోశిక కరుణాకర్



**చౌటుప్పల్.జులై19. ప్రభాత సూర్య :** అర్హులైన వారందరికీ వృద్ధాప్య,వితంతు, ఒంటరి మహిళలకు పెన్షన్లు ఇవ్వాలని సిపిఎం పార్టీ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.శనివారం చౌటుప్పల్ మున్సిపాలిటీ సమావేశం కామ్రేడ్ కందాల రంగారెడ్డి స్మారక భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత నాలుగు సంవత్సరాలుగా వృద్ధాప్య,వితంతు,ఒంటరి మహిళలు, బోదకాలు, టిబి వ్యాధిగ్రస్తులు, వికలాంగులు,కల్లుగీత కార్మికులు,చేనేత కార్మికులు ఎంతోమంది పెన్షన్లకు దరఖాస్తు చేయడం జరిగిందని తెలిపారు. అధికారుల చుట్టూ అనేకమార్లు తిరిగిన పెన్షన్లు సాంక్షన్ చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని పేదలను అధికార పార్టీ ఇబ్బందికి గురి చేస్తుందని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 100 రోజుల్లోనే ఇచ్చిన హామీలు అమలు చేస్తామని చెప్పి 20 నెలలు గడుస్తున్న అతి గతి లేదని అన్నారు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా పెన్షన్లు పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కమిటీ సభ్యులు ఎండి పాషా, గోశిక కరుణాకర్ లు మాట్లాడుతూ.. ఈనెల 29న మంగళవారం లింగారెడ్డిగూడెంలో ఎం ఎస్ ఫంక్షన్ హాల్ లో సిపిఎం పార్టీ యాదాద్రి భువనగిరి జిల్లా వర్క్ షాప్ నిర్వహించి జిల్లా వ్యాప్తంగా ఉద్యమాన్ని %న%ఉధృతం చేస్తామని అన్నారు. అఖిల భారత %న%మహాసభలలో కర్తవ్యాలను జిల్లాకు అన్వయించి%నన% ప్రణాళిక బద్ధంగా పనిచేస్తామని, ప్రజా ఉద్యమాలపై ,సమస్యలపై, జిల్లా వ్యాప్తంగా కార్యాచరణ రూపొందిస్తామని అన్నారు. అనంతరం జిల్లా వర్క్ షాప్ కరపత్రం విడుదల చేయడం జరిగింది. ఈ సమావేశంలో మున్సిపల్ కార్యదర్శి గోశిక కరుణాకర్, జిల్లా కమిటీ సభ్యులు ఎండి పాషా, అవ్వారి రామేశ్వరి, నాయకులు బండారు నరసింహ,చీర్క సంజీవరెడ్డి,బత్తుల దాసు, చీరక అలివేలు,ఆకుల ధర్మయ్య,బోయ యాదయ్య,పొట్ట శ్రీను, చికూరి ఈదయ్య, తూర్పునూరి మల్లేశం, జంగయ్య,కొండే శ్రీశైలం, సిహెచ్ పాండు,సప్పిడి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పుట్టపాక హైస్కూల్‌లో రోబోటిక్స్, ఏఐపై అవగాహన సదస్సు





ఐటింకర్ -బ్రైన్ బెంచ్ ఆధ్వర్యంలో నిర్వహణ.

భవిష్యత్ అంతా రోబోటిక్స్ అండ్ ఏఐ దే.

పాఠశాలల్లో రోబోటిక్ లాబ్స్ ఏర్పాటు.

సంస్థ సీఈఓ సుమన్ కుమార్ రెడ్డి.

**సంస్థాన్ నారాయణపురం, జూలై 19( ప్రభాత సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల పుట్టపాక జడ్పి హైస్కూల్ లో ప్రముఖ రోబోటిక్ సంస్థ ఐటింకర్ -బ్రైన్ బెంచ్ ఆధ్వర్యంలో శనివారం పాఠశాల విద్యార్థులకు రోబోటిక్స్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) పై ఉచిత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుత సమాజంలో మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతికం గా వస్తున్న మార్పులను వివరిస్తూ సాగిన ఈ కార్యక్రమం విద్యార్థుల్లో ఎంతో ఉత్సహన్ని నింపింది. భవిష్యత్ లో విద్యార్థుల చదువుల్లో రోబోటిక్స్ అండ్ ఏఐ కోర్సులకు ఉన్న ప్రాధాన్యతను కూడా ఇందులో ప్రముఖంగా వివరించారు. ఈ అవగాహన కార్యక్రమం ద్వారా విద్యార్థులకు రోబోలు, సెన్సర్లు, ఏఐ వంటి ఆధునిక సాంకేతికతలను ప్రత్యక్షంగా అనుభవించే అవకాశాన్ని కల్పించారు. విద్యార్థులు తాము స్వయంగా చిన్న రోబోలు నిర్మించడం, ముఖం, శబ్దాన్ని గుర్తించే విధానాలను అర్థం చేసుకోవడం, సాంకేతికత వాస్తవ జీవితంలో ఎలా ఉపయోగపడుతుందో చూడగలిగారు. చాలా మంది విద్యార్థులు ఈ తరహా సాంకేతిక పరిజ్ఞానాన్ని తొలిసారి దగ్గర నుంచి చూడడం వల్ల చాలా ఆనందం వ్యక్తం చేసారు. జిజ్ఞాసతో కూడిన ప్రశ్నలు అడుగుతూ ఉత్సాహంగా చర్చల్లో పాల్గొన్నారు, భవిష్యత్ లో తాము కూడా ఇలా రోబోల అభివృద్ధి లో పాలు పంచుకుంటామన్న ఆత్మవిశ్వాసాన్ని వ్యక్త పరిచారు. ఈ సందర్భంగా సంస్థ సీఈఓ కొట్టం సుమన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనలను ప్రోత్సహించడంతో పాటు, సాంకేతిక రంగంలో ఎవరికైనా ఎదగాలన్న నమ్మకాన్ని కలిగించడం కోసమే దీన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. తమ ఐటింకర్ బ్రైన్ బెంచ్ ద్వారా ఇటువంటి శిబిరాలను మరిన్ని పాఠశాలల్లో నిర్వహించాలని ప్లాన్ చేసినట్లు వెల్లడించారు. ఆసక్తి ఉన్న పాఠశాలల్లో స్థిరమైన రోబోటిక్స్ ల్యాబ్‌లు కూడా ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో ఉన్నట్లు వివరించారు. ఇలాంటి వాటి ద్వారా సమాజంలోని అట్టడుగు వర్గాల నుంచి వస్తున్న విద్యార్థులు సైతం నూతన ఆవిష్కర్తలుగా, నూతన సాంకేతిక నాయకులుగా ఎదగడానికి తొడ్పడతాయన్నారు. వీటి వల్ల విద్యార్థుల్లో అవసరమైన ఆత్మవిశ్వాసం, సృజనాత్మకత, నైపుణ్యాలను పెంపొందించడమే తమ సంస్థ లక్ష్యమన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్. హన్మంతు మాట్లాడుతూ రోబోటిక్స్ యుగం నేపథ్యంలో ఈ కార్యక్రమం తమ విద్యార్థులకు ఎంతో ఉపయోగపడిందని నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంతో విద్యార్థుల్లో స్ఫూర్తి నింపేందుకు దోహద పడిందన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు కొత్తపల్లి శ్రీనాధ్, కే. అశ్విత్ రాజ్, పాఠశాల ఉపాధ్యాయుడు, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ నరేందర్ రెడ్డితో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యా ఉద్యోగ చట్టసభలలో 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి

బీసీలపై దాడులు అరికట్టడానికి రక్షణ చట్టం తీసుకురావాలి

తీన్మార్ మల్లన్న పై దాడిని ముక్తకంఠంతో ఖండించిన బిసి కుల సంఘాల ప్రతినిధులు



**వనపర్తి ప్రభాత సూర్య ప్రతినిధి:** వనపర్తి జిల్లా కొత్తకోట పట్టణ కేంద్రంలో గౌనికాడి రాములు యాదవ్ అధ్యక్షతన క్యూఆర్ ఫంక్షన్ హాల్ నందు నిర్వహించిన దేవరకద్ర నియోజకవర్గస్థాయి బీసీ కుల సంఘాల ప్రతినిధుల రౌండ్ టేబుల్ సమావేశానికి ముఖ్య అతిథులుగా విజయ్ కుమార్ ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా రిటైర్డ్ విద్యాశాఖ అధికారి మరియు వేణుగోపాల్ మాజీ జడ్పిటిసి చిన్నచింత కుంట, రాజేష్ గౌడ్ మాజీ జెడ్పిటిసి భూత్పుర్ మండలం విశిష్ట అతిథులుగా పాల్గొని మాట్లాడుతూ.... బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేసిన తరువాతే తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని,అమలు కాని హామీలు, ఆర్డినెన్స్‌ల పేరుతో ప్రజలను మోసం చేయాలని చూస్తే తెలంగాణ ఉద్యమం తరహాలో బీసీ ఉద్యమం చేపడతామని,తమిళనాడు తరహాలో మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించి అమలు కావాలంటే ఈ అంశాన్ని రాజ్యాంగం 9వ షెడ్యూల్‌లో చేర్చేలా పార్లమెంటు ద్వారా చట్టం రూపొందించేందుకు కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి పెంచాలని,స్థానిక సంస్థలలో బీసీ కులాలకు 42 శాతం రిజర్వేషన్ కేవలం రాజకీయ లబ్ధి కోసమే రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్ సవరణ చేయకుండా శాసనసభలో మరియు పార్లమెంటులో ఎలాంటి చర్చ చేయకుండా బిల్లు పెట్టకుండా కేవలం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు జరగదని 42 శాతం రిజర్వేషన్ విద్యా ఉద్యోగ రంగాలతో పాటుగా చట్టసభలలో రిజర్వేషన్ పార్లమెంట్ ద్వారా చట్టం చేసినప్పుడే బీసీలకు న్యాయం జరుగుతుందని రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న బీసీ ప్రతినిధులు ముక్తకంఠంతో ప్రతిఘటించారు బీసీలకు రాష్ట్రంలో రక్షణ లేకుండా పోతుందని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పై రాష్ట్రంలో జరిగినటు వంటి దాడిని తీవ్రస్థాయిలో బిసి సమాజం వ్యతిరేకిస్తుందని ఇలాంటి ఘటనలు పునరావతం కాకుండా బీసీలకు రక్షణ చట్టం తేవాలని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వెంకటన్న గౌడ్ యాదగిరి మాజీ వార్డు సభ్యులు తిరుపతయ్య వాల్మీకి మూసాపేట మండల బీజేపీ అధ్యక్షులు సిటీకేబుల్ బాలు బిజెపి ప్రధాన కార్యదర్శి కొత్తకోట సురేష్ గౌడ్ కార్యదర్శి కొత్త గంగాధర్ దేవరకద్ర గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ అధ్యక్షులు భాస్కర్ ముదిరాజ్ లాల్కోట రవి రాజేందర్ ఘటన మూర్తి కిషన్ నాయక్ టీడీపీ రమేష్ చారీ రామచంద్రయ్య దోళ్ల మన్యం సీనియర్ నాయకులు వెంకటేష్ యాదవ్ తిరుపతయ్య యాదవ్ మహేశ్వరి రాములు యాదవ్ కొత్తకోట మాజీ కౌన్సిలర్ శేఖర్ నాయుడు వెంకటేష్ రామకృష్ణ వడ్డెర సంఘం జిల్లా నాయకులు అజ్జకొల్లు బుచ్చన్న మాజీ సర్పంచ్ రవీందర్ గౌడ్ ఉషన్న యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అండగా ఉంటుంది.

రేషన్ కార్డుల పంపిణీలో ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్.



**నల్గొండ జులై 19 ప్రభాత సూర్య :** రేషన్ కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ అని శాసనమండలి సభ్యులు, డిసిసి అధ్యక్షుడు కేతావత్ శంకర్ నాయక్ అన్నారు. శనివారం ఆయన నల్గొండ ఆర్డీవో కార్యాలయంలో నల్గొండ నియోజకవర్గ పరిధిలోని లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులు, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్సీ మాట్లాడుతూ గత ప్రభుత్వం గడిచిన 10 సంవత్సరాలలో ఒక్క రేషన్ కార్డు మంజూరు చేయలేదని, అలాంటిది తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నూతన రేషన్ కార్డులను ఇస్తున్నదని తెలిపారు. తమ ప్రభుత్వం పేద ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. రేషన్ కార్డులు రానివారు అధైర్య పడాల్సిన అవసరం లేదని, ఇది నిరంతరం కొనసాగే ప్రక్రియ అని చెప్పారు. జిల్లా సర్వతో ముఖ వృద్ధి కోసం మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఎంతో కృషి చేస్తున్నాడని అన్నారు. అభివృద్ధిలో నల్గొండ నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో ముందుకు తీసుకెళుతున్నాడని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తుందని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రజలంతా కాంగ్రెస్ ప్రభుత్వానికి అండగా ఉండి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నల్గొండ ఆర్డీవో వై.అశోక్ రెడ్డి, తహసిల్దార్ పరుశురాం, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, డిసిసి డైరెక్టర్ పాశం సంపత్ రెడ్డి, నల్గొండ మాజీ మున్సిపల్ చైర్మన్ లు బుర్రి శ్రీనివాస్ రెడ్డి, బొడ్డుపల్లి లక్ష్మీ శ్రీనివాస్, నల్గొండ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి, నల్గొండ మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, మాజీ జెడ్పిటిసి వంగూరి లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

## మల్లారెడ్డి కుంట ఎత్తు పెంచడంతో 12 ఎకరాల పత్తి పంట నష్టం



**సంస్థాన్ నారాయణపురం, జూలై 19( ప్రభాత సూర్య ):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం అరేగూడెం గ్రామానికి చెందిన వంగూరి శ్రీనివాస్ యాదవ్, వారి కుటుంబ సభ్యులకు చెందిన 12 ఎకరాల పత్తి పంట నీటమునిగింది. ఇటీవల మల్లారెడ్డి కుంట ఎత్తు పెంచడంతో నిన్న మొన్నటి వర్షలకు నీరు భారీగా చేరి నిండడంతో తమ 12 ఎకరాల పత్తి పంట పూర్తిగా నీట మునిగిందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం తనకు న్యాయం చేయాలనీ వేడుకుంటున్నాడు.

## నాణ్యతకు మారుపేరు హైదరాబాద్ సువర్ణం జువెలర్స్



**నల్లగొండ జులై 19 ప్రభాత సూర్య** నల్లగొండ పట్టణంలో సువర్ణం జువెలరీ హైదరాబాద్ షోరూం డైమండ్ ఎగ్జిబిషన్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ ఎగ్జిబిషన్ జూలై 19 ,20 తేదీలలో ఎగ్జిబిషన్ కార్యక్రమం నల్గొండలో కొనసాగుతుంది. ఈ ఎగ్జిబిషన్లో వివిధ రకాల బంగారు ఆభరణాలు ప్రదర్శిస్తున్నారు మరియు అదే విధంగా విక్రయిస్తున్న కస్టమర్ లందరూ ఈ ఎగ్జిబిషన్ ని సందర్శించి డైమండ్ ఆభరణాలు చూడవచ్చని మరియు విక్రయించవచ్చని తెలిపారు .ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నల్లగొండ మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి మరియు వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్ నల్లగొండ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్ రెడ్డి , మాజీ జెడ్పిటిసి వంగూరి లక్ష్మయ్య ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. నాణ్యతకు మారుపేరు సువర్ణం జువెలర్స్ వారు మన నల్లగొండ నల్లగొండ కి వచ్చి ఇక్కడ మేకింగ్ చార్జెస్ లేకుండా అమ్మకాలు జరపడం జరుగుతుంది. సువర్ణం జువెలర్స్ స్టోర్ మేనేజర్ కంతాల కార్తీక్ మాట్లాడుతూ హైదరాబాద్ కు చెందిన ప్రముఖ జ్యువెలరీ రిటైలర్ సువర్ణం జువెలరీ మార్ట్ క్యాపిటల్ మార్కెట్లోకి వచ్చి గత ఐదు సంవత్సరాలుగా అమ్మకాలు జరపడం జరుగుతుంది అని తెలిపారు .ఈ కార్యక్రమంలో సువర్ణం జ్యువెలర్స్ స్టోర్ మేనేజర్ మార్కెటింగ్ మేనేజర్ బొడ్డు సాయికుమార్, జ్యువెలరీ ఉద్యోగులు, కస్టమర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శ పాఠశాలను సందర్శించిన బీఆర్ఎస్ విద్యార్థి నేతలు



**చౌటుప్పల్.జులై 19. ప్రభాత సూర్య:** ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా వరుసగా గురుకుల పాఠశాలలో విద్యార్థులకు ఫుడ్ పాయిజనింగ్ ఘటనలు సంభవిస్తున్న నేపథ్యంలో చౌటుప్పల్ బీ ఆర్ఎస్ పార్టీ విద్యార్థి విభాగం నాయకులు చౌటుప్పల్ పురపాలక కేంద్రం, లక్కారం గ్రామ పరిధిలోని ఆదర్శ పాఠశాల, కళాశాలను శనివారం సందర్శించారు. విద్యార్థులకు అందుతున్న ఆహార వసతులను పరిశీలించి విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని కోరారు. వంట గది నిర్మించేందుకు సహకరించాలని ప్రిన్సిపాల్ సరస్వతి వారిని కోరగా విద్యార్థి విభాగం ప్రతినిధులు తాము ఈ సమస్యలను సంబంధిత అధికార యంత్రాంగం దృష్టికి తీసుకెళ్ళి, వీలైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ మండలం నాయకులు గంగాదేవి శివ, చౌటుప్పల్ మున్సిపల్ నాయకులు ఊదరి రాకేష్. అత్తుచింటు,సురేష్,అల్లి రేహన్, నాజర్ లు పాల్గొన్నారు.

## అక్రమంగా తరలిస్తున్న పశువులు పట్టివేత




**చౌటుప్పల్.జూలై19. ప్రభాత సూర్య:** చౌటుప్పల్ మండల కేంద్రం, కైతపురం గ్రామం దగ్గర శనివారం ఉదయం సుమారు 9:30 గంటల సమయంలో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా టాటా ఇన్ఫ్రా పికప్ వాహనం ఏపీ 39 యుహెచ్ 7178 నెంబర్ గల వాహనాన్ని అనుమానాస్పదంగా తనిఖీ చేయగా అందులో మొత్తం 11 ఎద్దులు ఉన్నట్టు సీఐ మన్మధ కుమార్ తెలిపారు. పశువులను తుని సంత నుండి కొనుగోలు చేసి బహదూర్పుర్ హైదరాబాద్ కు తరలిస్తుండగా పట్టుకోవడం జరిగిందన్నారు. వాహనాన్ని స్వాధీనం చేసుకున్నమన్నారు. పశువుల అక్రమ రవాణా చేస్తున్న ఆంధ్రప్రదేశ్, చిలకలూరిపేట మండలం, పల్నాడు జిల్లా, గంగాపురం గ్రామానికి చెందిన డ్రైవర్ వంగ సత్తిబాబు(48) పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## సురారం లోని నాలెడ్జ్ ఐకాన్ స్కూల్‌లో భక్తిశ్రద్ధలతో వైభవంగా బోనాల ఉత్సవం






**కుత్బుల్లాపూర్, జులై 19 (ప్రభాత సూర్య) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, సూరారం విలేజ్ నాలెడ్జ్ ఐకాన్ స్కూల్ లో బోనాల ఉత్సవాన్ని భక్తి శ్రద్ధలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించగా, విద్యార్థులు పోతురాజు వేషధారణలో పాల్గొని అందరినీ ఆకట్టుకున్నారు. అలాగే పల్లకీ ఊరేగింపు, సంప్రదాయ నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు వేడుకలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పాఠశాల ఆవరణ సంప్రదాయ అలంకరణలతో కళకళలాడింది. పాఠశాల కరస్పాండెంట్ ఎం.వై. రాజేష్ కుమార్ మాట్లాడుతూ సాంప్రదాయాలు, సంస్కృతి, మానవ విలువలు విద్యార్థుల్లో పెంపొందిం చడమే మా లక్ష్యంఅని, పిల్లలు పాఠశాలలో విద్యా బోధనతో పాటు మన సంస్కృతిని అభివృద్ధి చేసుకోవాలని కోరుకుంటున్నాం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొని వేడుకను విజయవంతంగా నిర్వహించారు.

## మూసాపేట్ సర్కిల్ నూతన డిప్యూటీ కమిషనర్ గా ఇస్లావత్ నాయక్ బాధ్యతలు


**శుభాకాంక్షలు తెలిపిన బాలాజీ నగర్ కార్పొరేటర్ శిరీష బాబురావు**



**కూకట్ పల్లి, జులై 19 (ప్రభాత సూర్య) :** కూకట్ పల్లి నియోజకవర్గం, మూసాపేట్ జిహెచ్ఎంసి కార్యాలయంలో మూసాపేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ గా ఇస్లావత్ నాయక్ బాధ్యతలు స్వీకరించారు. శనివారం బాలాజీ నగర్ డివిజన్ కార్పొరేటర్ శిరీష బాబురావు మూసాపేట డిప్యూటీ కమిషనర్ ఇస్లావత్ నాయక్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బాలాజీనగర్ డివిజన్ అభివృద్ధికి సంబంధించిన ముఖ్యమైన అంశాలపై ఆమె డీసీతో చర్చించారు. పురపాలక సమస్యలు, డ్రెయినేజ్, రోడ్డు మరమ్మతులు, స్ట్రీట్ లైట్ల ఏర్పాటు వంటి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లిన శిరీష బాబురావు, వీటి పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి స్పందించిన డీసీ ఇస్లావత్ నాయక్ అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# ఖమ్మంలో ఆంధ్రా భూ బకాసురుడి అరాచకం

**-ఏపీలో వెలగబెట్టింది చాలక తెలంగాణలోనూ విచ్చలవిడి అక్రమాలు**
**-ఖమ్మంలో ఎన్నారై భూములపై కన్నేసి అక్రమంగా రిజిస్ట్రేషన్ల పరంపర**
**-అమ్మపాలెంలో అమ్ముడుపోయిన ఆర్బీఐ నిబంధనలు యధేశ్చగా కోర్టు ధిక్కరణ**
**-ఏపీలో గత ప్రభుత్వ పెద్దల తాలూకా మనిషినంటూ బరితెగింపు.. ఇప్పుడు ఖమ్మాన్ని తాకిన ఆంధ్రా రియల్ ఎస్టేట్ విష సంస్కృతి**
**-తొలుత రిజిస్ట్రేషన్.. ఆనక 60-40 పర్సెంటేజీతో సెటిల్మెంట్.. నయీమ్ తరహా నయా దందాతో వణికిపోతున్న ఖమ్మం**



**ఖమ్మం( సూర్య ప్రతినిధి) :** ఆంధ్రా తెలంగాణ రాష్ట్రాల నడుమ ఉన్న ఖమ్మం జిల్లా రెండు రాష్ట్రాల మిశ్రమ సంస్కృతికి పెట్టింది పేరు. కమ్యూనిస్టులకు కంచుకోటగా చెప్పుకునే ఖమ్మం గడ్డ రాజకీయ చైతన్యానికి నిజంగా ఓ కొలమానమే అలాంటి ఖమ్మం జిల్లాలో రియల్ ఎస్టేట్ రంగానికి అమితమైన ప్రాధాన్యం ఉంది.అయితే భూ వ్యాపారం నేలను విడిచి ఆకాశాన్ని తాకిన రోజుల్లోనూ ఇక్కడ నిబంధనల ఉల్లంఘన తలెత్తింది లేదు.కాగా ఓ ఆంధ్రా నయవంచకుడు ఖమ్మం రియల్ ఎస్టేట్ లో నయీమ్ మాదిరి ఆగడాలకు బరితెగిస్తున్నాడు. మునుపెన్నడూ లేని చందంగా ఖమ్మంలో నయా విష సంస్కృతికి పురుడు పోశాడు.ఇక్కడి ఎన్నారై భూములపై కన్నేసి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకుని కోట్లల్లో సెటిల్మెంట్ కు తెర లేపాడు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జగన్ సర్కారు కొలువై ఉన్నప్పుడు నాటి ప్రభుత్వ పెద్దల పేర్లను ఎంచక్కా వాడుకున్న ఈ ప్రబుద్ధుడు అటు ఆంధ్రాలో ఇటు హైదరాబాద్ లో రియల్ దందా సాగించాడు. సీఎం పేషీలో ప్రముఖుల పేర్లు వల్లెవేస్తూ రియల్ ఎస్టేట్ పైరవీలు నడిపాడు. ఇప్పుడు దినదినాభివృద్ధి చెందుతున్న ఖమ్మంపై అతగాడి దృష్టి పడింది. కోర్టు వివాదంలో ఉన్న భూములైనా ఎన్నారైలకు చెందిన భూమి అయినా పోరంబోకు భూములైనా ఇక మీ భూమిలో ప్రభుత్వ భూమి కలిసి ఉన్నా సరే అసలు పూర్తిగా సర్కారు స్థలమే అయినా సరే చివరికి అది అసైన్డ్ భూమి అయినా ఫర్వాలేదు నేను చెప్పిన పేరిట రిజిస్ట్రేషన్ చేయండి.అంతే చాలు. మిగతాది నేనే చూసుకుంటా అంటూ ఖమ్మంలో విలువైన భూములపై గద్దలా తిరుగుతున్నాడు.ఇలా భూములను అన్యాక్రాంతం చేసే క్రమంలో ఎలాంటి పరిణామాలకైనా తనదే బాధ్యత అంటూ భరోసా ఇస్తున్నాడు. రిజిస్ట్రేషన్ తర్వాత 60-40 పర్సంటేజీతో సెటిల్మెంట్ చేయడాన్ని ఇతను ఆనవాయితీగా మార్చుకున్నాడు.రెండు రాష్ట్రాల్లో పోలీస్ పవర్ నా చేతిలో ఉంది.. రెవెన్యూలో ఎలాంటి రికార్డు కదలాలన్నా నాకు చిటికెలో పని మీరు రిజిస్ట్రేషన్ ఆఫీస్ కి వచ్చి నేను చెప్పిన పేరిట రిజిస్ట్రేషన్ చేస్తే అంతే చాలు భూమిపైకి వెళ్లేటప్పుడు ఎవరడ్డు వచ్చినా నేనే చూసుకుంటా పరిస్థితి చేయి దాటితే రౌడీలను రంగంలోకి దింపుతా లోకల్ రౌడీలు సరిపోకపోతే హైదరాబాద్ నుంచి గుండాలను దించుతా క్లుప్తంగా ఇది ఆ భూ బకాసురుడి తీరు. భూముల అన్యాక్రాంతం కోసం ఎంతకైనా తెగించి దేనికైనా బరితెగించడంలో అతను దిట్ట.నయీమ్ తరహాలో రెచ్చిపోతున్న ఈ భూ బకాసురుడి వీర విహంగానికి రియల్ ఎస్టేట్ రంగం కుదేలవుతోంది. ఇతగాడి పోకడకు నివ్వెరపోవడం వ్యాపారులు బాధితులవంతవుతోంది.

### నిబంధనలు హుష్ కాకి ఓ ఎన్నారై భూమి రిజిస్ట్రేషన్

భారతదేశాన్ని విడిచి విదేశీ పౌరసత్వం పొందిన ఎన్నారైలు ఇక్కడ ఆస్తులను కొనుగోలు చేసే విషయంలో చట్ట ప్రకారం కొన్ని నిబంధనలున్నాయి. అవేంటంటే ఎన్నారైగా ఉన్న వ్యక్తి భారతదేశంలో ఫార్మ్ హౌస్ గానీ వ్యవసాయ భూమి కానీ ప్లాంటేషన్ భూమి కానీ కొనుగోలు చేయకూడదు. ఇలా ఒక వేళ కొనుగోలు చేయాలంటే ఆర్బీఐ అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. పర్మిషన్ లేకుండా కొనుగోలు చేస్తే భూమి విలువకు మూడు రెట్ల జరిమానాను భారత ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఇలా ఎన్నారైలు కొనుగోలు చేసిన భూమిని మరొకరికి విక్రయించడం కూడా చట్ట ప్రకారం నిషిద్ధమే అవుతుంది. అలాంటి భూములను బినామీ పేర్లతో కొనుగోలు చేసే "ప్రావీణ్యం" మన సిద్ధహస్తుడికే చెల్లుతోంది. ఖమ్మం జిల్లా కేంద్రానికి చుట్టూ 20 కిలోమీటర్ల పరిధిలో ఉన్న భూములు ధర పరంగా రెక్కలు తొడుక్కున్నాయి. దీంతో రియల్ భూ బకాసురులు భూముల అన్యాక్రాంతానికి ఎంతకైనా తెగిస్తున్నారు. ఖమ్మం నగరానికి పన్నెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న అమ్మపాలెంలో ఈ ఆంధ్రా కబ్జాకోరు ఒక ఎన్నారైకి చెందిన ఎనిమిదెకరాల భూమిపై కన్నేశాడు. ఈ భూమి కోర్టు వివాదంలో ఉన్నప్పటికీ ఒక బినామీ పేరిట జీపీఏ రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. ఈక్రమంలో ఆర్బీఐ నిబంధనలతో పాటు కోర్టు ధిక్కరణకు కూడా పాల్పడ్డాడు. ఒకవేళ వివాదం చోటుచేసుకుంటే రౌడీయిజాన్ని ప్రదర్శించడం గుండాగిరీకి దిగడం కోసం మందీ మార్బలాన్ని సిద్ధం చేసుకున్నాడు. అలాగే ఈ భూమికి పక్కనే ఉన్న మరో వివాదాస్పద భూమిలో సైతం రూ.3 కోట్లను బయానా రూపంలో పుచ్చుకోవడం ఇప్పుడు మరింత వివాదాస్పదంగా మారింది. ఇలా వివాదాల్లో ఉన్న భూములను తక్కువ ధరకు రిజిస్ట్రేషన్ చేయించుకుని ఆ తర్వాత ఆ వివాదాన్ని మరింత పెంచి పెద్ద చేయడాన్ని ఇతగాడు తన నైజంగా మార్చుకున్నాడు. ఈక్రమంలో పోలీసింగ్, రెవెన్యూతో పాటు ఇతర ప్రభుత్వ యంత్రాంగాలను సైతం యధేశ్చగా వాడుకుంటూ అవసరమైతే రౌడీలను రంగంలోకి దించి ప్రత్యర్థులను బాధితులను బెంబేలెత్తిస్తున్నాడు.

### ముగ్గురు మంత్రులున్న ఖమ్మం జిల్లాలో ఏమీ ఈ దుస్థితి

రాష్ట్రంలో ఏ జిల్లాకు పట్టని అదృష్టం ఖమ్మం జిల్లాకే పట్టింది. ఎందుకంటే ఇక్కడి నుంచి రాష్ట్ర కేబినెట్ లో ముగ్గురు మంత్రులు కొలువై ఉన్నారు. ఇందులో ఒకరు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కాగా మరొకరు ఎంతో కీలకమైన రెవెన్యూశాఖ మంత్రి కావడం విశేషం. ఇలాంటి ఖమ్మం జిల్లాలో ఆంధ్రా నుంచి వచ్చిన ఒక భూ బకాసురుడు హల్చల్ చేయడమే విడ్డూరం. కమ్యూనిస్టుల ప్రాబల్యం కలిగి అత్యంత చైతన్యం కలిగిన మేధావులున్న ఈ జిల్లాలో ఓ వ్యక్తి ఇక్కడి భూములపై రాబంధులా మారి పెత్తనం చేయడం విస్మయం కలిగిస్తోంది. అలాగే సీఎం పేషీలో ప్రముఖుల పేర్లు చెబుతూ ప్రభుత్వ యంత్రాగాలను సైతం ప్రభావితం చేస్తున్న తీరు విస్తుగొలుపుతోంది.

# ఆరు లైన్ల రోడ్డు విస్తరణ పనులను త్వరలో ప్రారంభిస్తాం

**తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు**

**కుత్బుల్లాపూర్, జులై 19 (ప్రభాత సూర్య) :** నగరంలోని మియాపూర్ నుండి గండిమైసమ్మ వరకు వాహనాల రద్దీ ఎక్కువగా ఉండటం వలన ఆరు లైన్ల రోడ్డు విస్తరణ పనులను త్వరలో ప్రారంభించబోతున్నామని తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. మియాపూర్ నుండి గండిమైసమ్మ వరకు 6 లైన్ల రోడ్డు విస్తరణ, బాచుపల్లి ఫ్లై ఓవర్ మల్లంపేట్ ఎగ్జిట్ ఓ ఆర్ ఆర్ నుండి బాచుపల్లి వరకు రోడ్డు విస్తరణ, కొంపల్లి నుండి బహదురుపల్లి, గండిమైసమ్మ నుండి బాచుపల్లి వెళ్లే రహదారిలో 1.5 కి మీ రోడ్డు ఫారెస్ట్ ని అనుకోని ఉండడం వలన ఫారెస్ట్ సంబందించిన అనుమతుల గురించి మినిస్టర్ ఛాంబర్ లో తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తో సమావేశంలో మినిస్టర్ సదురు ఫారెస్ట్ అధికారులతో మాట్లాడి ప్రణాళిక రూపొందించి జులై నెల ఆఖరి లోపు పనులు పూర్తిచేసుకోని సెప్టెంబర్ లో ప్రారంభించాలని సూచించారు. అదే విదంగా జీడిమెట్ల నుండి షాపూర్ వెళ్లే పైప్ లైన్ రహదారి లో షీల్డ్ బ్రిడ్జి పనులు త్వరగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్, జిహెచ్ఎంసి, హెచ్ఎండిఏ కమిషనర్లతో, రెవిన్యూ డివిజినల్ %డ% జోనల్ కమీషనర్ ఆఫీసర్లతో, తహసీల్దార్ కు తెలిపారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి, మల్కాజ్గిరి నియోజకవర్గ ఇంచార్జి మైనంపల్లి హనుమంత్ రావు, మాజీ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సరెడ్డి భూపతి రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జి వజ్రేష్ యాదవ్, ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జి పరమేష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శ్రీశైలం గౌడ్, మేడ్చల్ - మల్కాజ్గిరి జిల్లా గ్రంథాలయ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.




## ఘనంగా చోటా స్కూల్‌లో వర్షాకాల ఉత్సవాలు




**చౌటుప్పల్, జులై 19. ప్రభాత సూర్య :** చౌటుప్పల్ పురపాలక కేంద్రం, శివాజీ నగర్ కాలనీలోని చోటా స్కూల్‌లో వర్షాల ఉపయోగాలు తెలియజేస్తూ వర్షాకాల ఉత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వర్షాన్ని నేపథ్యంగా చేసుకొని చిత్రాలు గీయడం, కాగితపు పడవలు తయారు చేయడం, రంగుల గొడుగులు రూపొందించడం వంటి కళాఖండాలను తయారుచేసి ప్రదర్శించారు. వర్షానికి సంబంధించిన పాటలు పాడుతూ, ప్రత్యేక నృత్యాలతో చిన్నారులు అందరినీ అలరించారు. వర్షపు నీటిని ఉపయోగించి విద్యార్థులు కొన్ని విజ్ఞాన ప్రయోగాలు నిర్వహించారు. ప్రకృతిని ఆస్వాదించారు. ఇలాంటి కార్యక్రమాలు పిల్లల సృజనాత్మకతను, ఊహాశక్తిని పెంపొందించడమే కాకుండా, వారికి ప్రకృతితో అనుబంధాన్ని పెంచేలా సహాయపడతాయని పాఠశాల డైరెక్టర్ అండ్ ప్రిన్సిపాల్ క్రాంతి రెడ్డి అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు క్రాంతి రెడ్డి ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు ఓవరం

**లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిది చెక్కులను అందజేసిన టిపిసిసి ఉపాధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్**



**కూకట్ పల్లి, జులై 19 (ప్రభాత సూర్య) :** ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకు ఓ వరం అని టిపిసిసి ఉపాధ్యక్షులు, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్ అన్నారు. టిపిసిసి ఉపాధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్ ద్వారా ముఖ్యమంత్రి సహాయనిదికి ధరకాస్తూ చేసుకోగ 1,09,000/- రూపాయలు మంజూరు అయినవి. కూకట్ పల్లి నియోజకవర్గం లోని బాలనగర్ కి చెందిన 1) రాచూరి సంధ్యారాణి (భర్త) రాచూరి విజయకుమార్ 59,000 రూపాయల చెక్కు, 2) అల్లాపూర్ కి చెందిన చంద్రమౌళి (తండ్రి) లేట్ కే సంగప్ప 50,000 రూపాయల చెక్కులను బండి రమేష్ చేతులమీదుగా మూసాపేటలోని హేమదుర్గ భవన్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం లబ్ధిదారులకు బండి రమేష్ అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు లక్ష్మయ్య, తూము వేణు, మస్తాన్ రెడ్డి, రమణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, బండి రమేష్ కి కృతజ్ఞతలు తెలియజేశారు.

## లక్ష్యంతో పయనిస్తే విజయం వెతుక్కుంటూ వస్తుంది

**అకాడమిక్ డైరెక్టర్ అశోక్ కుమార్**

**పెద్దపల్లి :** పట్టణంలోని ట్రినిటీ ఇంజనీరింగ్ ఆటోనోమౌస్ కళాశాలలో ఎంబీఏ విద్యార్థుల 2౨25 ఫేర్వెల్ డే ఘనంగా నిర్వహించారు. మేనేజ్మెంట్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా అకాడమిక్ డైరెక్టర్ అశోక్ కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ గణేష్ మణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంబీఏ విద్యార్థులకు ప్రస్తుత పోటీ యుగంలో ఉజ్వల అవకాశాలు ఉన్నాయని, కష్టపడి చదివి ప్రతిరోజు తమ నైపుణ్యాలను పెంచుకున్న ట్లయితే ప్రతి ఒక్కరికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. ఎంబీఏ విద్యార్థుల అభ్యున్నతి కోసం కళాశాల చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి కార్యాచరణలో ప్రత్యేక చూపుతున్న శ్రద్ధ పట్ల విద్యార్థులలో వినూత్నమైన ఆలోచనలు కలగజేస్తూ ఉపాధి అవకాశమే లక్ష్యంగా కార్యక్రమాలను రూపొందిస్తు న్నారన్నారు. విద్యార్థులకు ప్రస్తుతం ఉన్న అవకాశాలను వినియోగించుకునే నైపుణ్యాన్ని పెంపొందిస్తుందని తెలిపారు. మ్యాజిక్ బస్సు ఫౌండేషన్ వారిచే విద్యార్థులకు ఉచితంగా ఉద్యోగ అవకాశాలు పొందడం కొరకు కావలసిన నైపుణ్యత ఆపిటివ్ రీజనింగ్ సాఫ్ట్ స్కిల్స్ కమ్యూనికేషన్ స్కిల్స్ అంది స్తున్నామన్నారు. తద్వారా రానున్న కాలంలో ప్లేస్మెంట్ డ్రైవ్ నిర్వహించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నందుకు కళాశాల చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి, కళాశాల వ్యవస్థాపకులు దాసరి మనోహర్ రెడ్డికి ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థులు తనకు మాత్రమే ఉపాధి కావాలని ఆలోచించకుండా అనేకమందికి ఉపాధి కల్పించే విధంగా ఆలోచించాలన్నారు. ఇది మేనేజ్మెంట్ స్కిల్స్ ఉన్న ఎంబీఏ విద్యార్థులకు మాత్రమే సాధ్యమని అన్నారు. అనంతరం విద్యార్థిని విద్యార్థులు ఆటపాటలతో ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో ఏవో సురేష్, హెచ్ ఓ డి డాక్టర్ ఆరిఫ్, డాక్టర్ రామ్మోహన్,డాక్టర్ అంబికా, రమేష్, శ్రీలత సాయి శ్రావణి, చొప్పరి వంశీ, ఇతర విభాగ ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ నిరసన

**పెద్దపల్లి :** మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ శనివారం మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పెద్దపెల్లి మున్సిపల్ కార్యాలయం ముందు నిరసన తెలిపి ధర్నా చేశారు. అనంతరం వారు స్థానిక సమస్యలు, రాష్ట్ర వ్యాప్త డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మున్సిపల్ కమిషనర్ కు అందజేశారు. మున్సిపల్ కార్మికుల పర్మినెంట్, కనీస వేతనం రెండో పి ఆర్ సిలో రూ. 26,000 నిర్ణయించి అమలు చేయాలన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు మున్సిపల్ కార్మికులను అమలు పరచాలని, ఒక్క పూట పని విధానం 5గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు 8 గంటల పని చెంచాలన్నారు. వీటితోపాటు ఇతర స్థానిక సమస్యలు పరిష్కరించాలని కమిషనర్ వెంకటేష్ కు వినతి పత్రం ద్వారా వివరించారు. దీనికి కమిషనర్ సానుకూలంగా స్పందించి స్థానిక సమస్యల పరిష్కారానికి తనవంతుగా రాష్ట్ర ప్రభుత్వనీకు సంబంధించిన అంశాలను ప్రభుత్వానికి నివేదిస్తానని తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ జిల్లా ప్రధాన కార్యదర్శి సావన పెల్లి వెంకటస్వామి, మున్సిపల్ అధ్యక్షులు ఆరేపల్లి చంద్రయ్య, మున్సిపల్ ప్రధాన కార్యదర్శి బొంకూరి సాగర్, మద్దెల రాజయ్య సాతురి రాజు, సలిగంటి సుశీల,కంపెల్లి దేవమ్మ గుండెటి లక్ష్మి, కుక్కలక్మితో పాటు పలువురు కార్మికులు పాల్గొన్నారు.

## మహిళల భద్రతకు షీ టీం తోడుగా ఉంటుంది

**పెద్దపల్లి :** మహిళల భద్రతకు షీటీం తోడుగా ఉంటుందని సభ్యులు స్నేహలత అన్నారు. రామ గుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు, షీ టీమ్ ఇంచార్జ్ ఎస్ ఐ లావణ్య ఆధ్వర్యంలో శనివారం మండలంలోని పెద్దకల్వల గ్రామంలో గల నోబెల్ హై స్కూల్ విద్యార్థులకు షీ టీం సభ్యులు అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో భాగంగా షీ టీం సభ్యులు స్నేహలత మాట్లాడుతూ మహిళల భద్రత, ఆన్లైన్ మోసాలు, యాంటీ డ్రగ్స్ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహిళల రక్షణ కోసం ప్రతి రోజు బస్టాండ్, ప్రధాన చౌరస్తాలో జన సమీకరణ ప్రాంతాల్లో కాలేజీల వద్ద షీ టీం నిరంతర పర్యవేక్షణ కొనసాగు తుందన్నారు. ఎవరైనా వేధింపులకు గురి చేస్తే మహిళలు, విద్యార్థులు భయపడకుండా 6303923700 నంబర్ కు ఫోన్ చేసి సమస్య తెలపాలన్నారు. ఫోన్ చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. అలాగే అత్యాశకు పోయి సైబర్ క్రైమ్ ఆన్లైన్ మోసాలు , లోన్ యాప్స్ కు గురవుతున్నారని వాటికి జోలికి పోకుండా ఉండాలన్నారు. ఎవరైనా ఆన్లైన్ మోసాలకు గురైతే సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కి సమాచారం ఇవ్వాలని, అలాగే మహిళల కు ఏదైనా ప్రమాదం ఉన్నట్ల యితే, బెదిరింపులకు గురైతే వెంటనే 100 నంబర్ కు డయల్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో షీ టీమ్ సభ్యులు మౌనిక, సురేష్, కరస్పాండెంట్ మోహన్ రాజా, హెడ్ మాస్టర్ ప్రణిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యుత్ ప్రమాదరహిత లక్ష్యంలో భాగస్వామ్యం కావాలి

**పెద్దపల్లి సర్కిల్ సూపెరింటెండింగ్ ఇంజనీర్ గంగాధర్**

**పెద్దపల్లి :** విద్యుత్ ప్రమాదరహిత లక్ష్యంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని పెద్దపల్లి సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ గంగాధర్ అన్నారు. శనివారం ఆయన మీడియాకు ఇచ్చిన ప్రకటనలో పేర్కొంటూవిద్యుత్ వినియోగదారులు, రైతులకు మీ పరిధిలో ప్రమాదభరితంగా, వదులుగా ఉన్న విద్యుత్ తీగలు, తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్ఫార్మర్ల గద్దెలు , వంగిన స్థంబాలు, రోడ్ పై గుండా తక్కువ ఎత్తులో ఉన్న లైన్ క్రాసింగ్ తదితర వాటిని గమనించిన వెంటనే సంబంధిత పరిధిలోని సెక్షన్ ఆఫీసర్, గ్రామ స్థాయిలోని లైన్ మెన్ కు తెలపాలని అన్నారు. జీరో ఆక్సిడెంట్ లక్ష్యంలో అందరు భాగస్వామ్యులు కావాలని ఆయన పిలుపునిచ్చారు. తమ దృష్టికి వచ్చిన విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తామని తద్వారా విద్యుత్ ప్రమాదాలను నివారించగలుగుతామని స్పష్టం చేశారు. విద్యుత్ ప్రమాదాల నివారణకు ప్రజల సహాయ సహకారాలు కావాలని కోరారు. విద్యుత్ పట్ల అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని ఎట్టి పరిస్థితుల్లో స్వంతంగా పనులు చేయకూడదని సూచించారు. భారీ వర్షాలు, గాలి దుమారాల వలన విద్యుత్ తీగలు తెగి పడితే వెంటనే సమాచారాన్ని ఏఈ లకు తెలపాలన్నారు. తడిగా ఉన్న స్థంబాలను ముట్టుకోకూడదని, ఇంటిలోకి వచ్చే సర్వీస్ వైర్ ఎటువంటి అతుకులు లేకుండా, అలాగే ఇనుప రేకుల గుండ వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పశువుల కాపరులు పశువులను విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లు, లైన్ల దగ్గరికి ,వెళ్లకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు . వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించడంలో భాగంగా వారి సహాయ సహకారాలతో మరింత ఉత్తమైన సేవలు అందించడానికి ప్రజల భాగస్వామ్యం కావాలన్నారు. ఎలాంటి విద్యుత్ సమస్యలు వున్నా టోల్ ఫ్రీ నెంబర్ 1912 కు సంప్రదించాలని ఆయన తెలిపారు.

## అభివృద్ధి పనులపై బిఆర్ఎస్ పార్టీ నాయకులు చర్చకు సిద్ధమా

నర్సంపేట : పది సంవత్సరాలు అధికారంలో ఉండి నిరుపేదలకు ఒక్క ఇళ్లు కట్టించలేని బిఆర్ఎస్ పార్టీ నాయకులు 18 నెలల కాలంలోనే పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఆరు గ్యారంటీలు అమలు పరుస్తూ సన్న బియ్యం అందిస్తున్న కాంగ్రెస్ పార్టీని విమర్శించడం సరికాదని నల్లబెల్లి కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ వైనాలా అశోక్ అన్నారు.శనివారం కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ,బిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు మీనాయకుడు కులసంఘాలకు భవనాలు కట్టిస్తానని కొబ్బరి కాయలు కొట్టిన విషయం మరిచి పోయారా అని విమర్శించాడు.వరంగల్ నుండి నర్సంపేట వరకు ఇండస్ట్రీయల్ కారిడార్ ఏర్పాటు చేస్తానన్న మాటలు ఏమైనాయని ప్రశ్నించ్చాడు.ఎవరు అధికారంలో ఉన్నప్పుడు ఎంత అభివృద్ధి జరిగిందో చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరాడు.కాంగ్రెస్ పార్టీ గుర్తుపై గెలిచి కాంగ్రెస్ పార్టీని విమర్శించే వారికి రానున్న రోజుల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పుతారని అన్నాడు.







Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G.
Owned by Makam Gangadhar and Printed at Ratna Graphics, H.No. 2-3-703/7, Thirumala Nagar Colony, Opp: Amberpet Police Line, Hyderabad - 500 013T.G.
H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. TGTEL/2025/A0121.